ప్రజాశక్తి

మంగళవారం 31 అక్టోబర్ 2023

8 పేజీలు





ఎన్‌టిఆర్ కృష్ణా



గుడివాడ రోడ్డుపై దుంగలు అడ్డంగా పెట్టి నిరసన తెలుపుతున్న రైతులు

సాగునీటి కోసం



నాగాయలంక మండలం పెద్దపాలెం లాకుల వద్ద రైతుల నిరసన

రోడ్డెక్కిన రైతులు

రోడ్డుపై తాటి దుంగలు ఉంచి నిరసన

ప్రజాశక్తి-ఉయ్యూరు, అవనిగడ్డ : సాగునీటి కోసం రైతులు రోడ్డెక్కారు. తమకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఉయ్యూరు మండలం కలువపాముల వద్ద విజయవాడ- గుడివాడ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. కాల్వల ద్వారా పొలాలకు నీరందక బీటలు వారుతుంటే పెరిగిన పచ్చని పైరు ఎండిపోతందని రైతులు రోడ్డుపై తాటి దుంగలు అడ్డుగా ఉంచి ఆందోళన చేపట్టారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. సాగు నీరందించి పంటలను కాపాడాలని కోరారు. అనంతరం లాకులవద్దకు చేరి ఆందోళనకు దిగారు. పరిస్థితిని గ్రామ సర్పంచ్ పొనుగుమాటి సుబ్రమణ్యేశ్వరరావు ఫోన్ ద్వారా ఇరిగేషన్ అధికారుల దష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. సాయంత్రానికి నీరందిస్తామన్న ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన హామీ మేర రైతులు ఆందోళన విరమించారు. వర్షాలు లేక సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే చూస్తూ సహించలేని రైతులు సోమవారం నాగాయలంక ప్రాంతంలో రోడ్డెక్కారు. నాగాయలంక మండలం పెద్దపాలెం లాకుల వద్ద ఆ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రైతులు రోడ్డుపై బైఠాయించి తక్షణమే తమకు సాగునీరు విడుదల చేయాలని నినాదాలు చేశారు. సాగునీరివ్వకపోతే తమకు చావే పరిష్కారం అంటూ రైతులు ఆందోళన చేశారు. పంటలు ఎండిపోతున్నాయని చెబితే ఇరిగేషన్ అధికారులు, స్థానిక నాయకులు పట్టించుకోవడంలేదని రైతులు వాపోయారు.

సాగునీటిపై పర్యవేక్షణకు పోలీసు గస్తీ

కలెక్టర్ రాజాబాబు ఆదేశం


ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : అవసరానికి మించి సాగునీరు వినియోగించడాన్ని నివారించేందుకు కాల్వగట్లపై పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. తద్వారా శివారు ప్రాంతాలకు సాగునీరు అందేలా చూడాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం సోమవారం కలెక్టరేట్లో స్పందన మీటింగ్ హాల్లో మండలి చైర్మన్ జన్ను రాఘవరావు అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో సాగునీటి సరఫరా, ఈ ఏడాది ధాన్యం సేకరణ తదితర అంశాలపై సమీక్ష జరిగింది. కాల్వల శివారు ప్రాంతాలకు సాగునీటి సరఫరా జరగక రైతులు పడుతున్న ఇబ్బందులపై చర్చించారు. ఈసందర్భంగా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ సాగునీటి కొరత కారణంగా ఈసారి వారాబందీ అమలు (మిగతా 6లో)



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ఉల్లి ఘాటు

- రైతు బజార్లలో కిలో రూ.58
- బహిరంగ మార్కెట్లో రూ.70
- సగానికి సగం తగ్గిన దిగుమతి



ప్రజాశక్తి - విజయవాడ

ఉల్లి ధర ఘాటుతో సగటు వినియోగదారుడు బెంబేలెత్తుతున్నాడు. అమాంతంగా పెరిగిన ధరతో సామాన్యులు ఉల్లిపాయ కొనలేని పరిస్థితి ఏర్పడుతోంది. నగరంలోని తొమ్మిది రైతు బజార్లతోపాటు ఎన్‌టిఆర్‌జిల్లాలోని మరో ఆరు రైతు బజార్లలో సోమవారం కిలో ఉల్లిపాయలు రూ.58 (పాతవి), కొత్తవి రూ.48 ధర పలికింది. అదే బహిరంగ మార్కెట్లో కిలో ఉల్లి రూ.65 నుంచి రూ.70 పైగా ధర పలుకుతోంది. డిమాండ్ ఆధారంగా ఈ ధరలు ఇంకా పెరిగే సూచనలు లేకపోలేదని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. ఇటీవల వరకు కిలో ఉల్లిపాయలు రూ.20 నుంచి రూ.25 వరకు ధర పలికాయి. అయితే ఉల్లి ధర క్రమంగా పెరుగుతుండడంతో ఇటీవల ఎన్నడూలేని రీతిలో కిలో టమాటా ధర రూ.100 పైగా కేజి పలికిన పరిస్థితులను వినియోగదారులు గుర్తు చేసుకుంటున్నారు. ఇదే రీతిలో ఉల్లి ధర పెరిగినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

సగానికి సగం తగ్గిన ఉల్లి దిగుమతి

ఎన్‌టిఆర్ జిల్లాలోని రైతు బజార్లకు కర్నూల్‌తోపాటు మహారాష్ట్ర ప్రాంతం నుంచి దిగుమతి అయ్యే ఉల్లిపాయలు సగానికి సగం తగ్గిపోయాయని ఆయా రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు చెబుతున్నారు. సాధారణ రోజుల్లో విజయవాడ నగరంలోని తొమ్మిది రైతు బజార్లకు రోజుకు సుమారు రెండు లారీల (20 టన్నులు) ఉల్లిపాయలు వచ్చేవని, ప్రస్తుతం కేవలం 10 టన్నులు కూడా రావడం కష్టంగా ఉందని పటమట రైతు బజార్ ఎస్టేట్ అధికారి వివరించారు. పెరిగిన ధరలతో సామాన్యులు ఉల్లిపాయలు కొనడానికి సాహసించడం లేదని, కిలో రెండు కిలోలు తీసుకునే మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలు సైతం అరకిలో, పావు కిలోకే పరిమితం అవుతున్నారని రైతు బజారులోని వ్యాపారులు చెబుతున్నారు.

వర్షాభావం, వాతావరణ పరిస్థితులు...

దెబ్బతిన్న పంట...భారీగా తగ్గిన దిగుబడి

వర్షాభావ పరిస్థితులతోపాటు తగ్గిన సాగు విస్తీర్ణం, సరిగా నీరందకపోవడం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా పంట దిగుబడులపై తీవ్రమైన ప్రభావం చూపాయని వ్యాపారవర్గాల వారు, మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఉల్లి కొత్త పంట ఆశాజనకంగా లేదు. ఇటీవల మహారాష్ట్రలో అతి వృష్టి వల్ల కూడా ఉల్లిపంట దెబ్బతిన్నదని అంటున్నారు. కర్నూల్ జిల్లాలో ప్రతి ఏటా సాధారణంగా రైతులు లక్ష ఎకరాల్లో ఉల్లి సాగు చేస్తుండగా, ఈ ఏడాది 64 వేల ఎకరాల్లోనే సాగుచేసినట్లు చెబుతున్నారు. ఫలితంగా 36 శాతం ఉల్లి సాగు తగ్గినట్లు అధికారులు వివరిస్తున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనమాక ఏరియాలో 200 ఎకరాల వరకు ఉల్లిపంట వేసే రైతులు ఈసారి ఆ పంటను వేయడం మానుకున్నారు. ఇదే రీతిలో కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో కూడా అడపాదడపా వేసే రైతులు కూడా నష్టాలు వస్తున్నాయని ఆ పంట వేయడానికి రైతులు సాహసించడం లేదు.

నేడు విఎంసి కౌన్సిల్ సమావేశం

పలు అంశాలపై కసరత్తు పూర్తి



ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు జరగనుంది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుంది. ఈసమావేశంలో చర్చకు వచ్చే అంశాలపై కసరత్తు కూడా పూర్తయింది. దెబ్బతిన్న అంతర్గత రహదారులు, యుజిడి, కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్, మెట్లు తదితరాల పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం సర్వసాధారణమైంది. రూ.35 కోట్ల వరకు పెండింగ్ బిల్లులు ఎప్పటికి జమ చేస్తారోనని కాంట్రాక్టర్లు ఎదురు చూడాల్సి వస్తోంది. గాంధీహిల్, పార్కులు, కబేళా, ఎస్‌టిపిలు పిపిపి పద్ధతిలో ప్రయివేటు వ్యక్తులు, సంస్థలకు కట్టబెట్టడానికి పాలకవర్గం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. అజెండాలోని 55/349 అంశానికి సంబంధించి విఎంసికి చెందిన 782.22 చదరపు గజాల స్థలాన్ని గుణదల ప్రభుత్వ దంత వైద్యశాల ఎదురుగా ఉన్న సెయింట్ జాన్స్ ఎడ్యుకేషనల్ సొసైటీకి ఇచ్చేలా, ఈ స్థలానికి బదులుగా గుణదల-1, బిసైడ్స్ 100 అడుగుల రోడ్డు నుంచి పాయకాపురం రోడ్డులో ఆర్‌ఎస్ నెంబర్ 54/1బి, 1242.3 చదరపు గజాల స్థలాన్ని స్కూల్ వారు విఎంసికి ఇచ్చేవిధంగా అనుమతి కోరుతూ వైసిపి ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ ప్రతిపాదన పెట్టారు. అలాగే వన్‌టౌన్‌లోని షేక్‌రాజాసాహేబ్ విఎంసి హాస్పిటల్‌ను 100 పడకల హాస్పిటల్‌గా విస్తరించి, డాక్టర్లు, పరికరాలు, మందులు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఏళ్ల తరబడి ప్రతిపాదనగానే మిగిలిపోతుంది. అలాగే నాలుగున్నరేళ్ల క్రితమే నిర్మించి దెబ్బతింటున్న వేలాది టిడ్కో గృహాలు, జెఎన్‌ఎన్‌యుఆర్ గృహాలను అర్హులై రిజిస్ట్రేషన్ చేసిన వారికి తక్షణమే పంపిణీ చేయాలని లబ్దిదారులతోపాటు విపక్షాలు చేస్తున్న డిమాండ్ పరిష్కారానికి నోచుకోవడంలేదు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం పక్క రోడ్డులో నిర్వహిస్తున్న ఈట్ స్ట్రీట్ మాదిరిగానే ... విద్యాధరపురం ప్రాంతంలోనూ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను అధికారపక్షం అజెండాలోకి తీసుకువస్తోంది. కౌన్సిల్‌కు అధికార వైసిపి, విపక్ష టిడిపి, సిపిఎంలు అన్ని రకాలుగా సిద్ధమయ్యాయి.



నరసిం హారావు సంస్మరణ సభలో మాట్లాడుతున్న పి.మురళీకృష్ణ

ప్రజా సేవకులు నరసింహారావు

సంతాప సభలో వక్తలు

వార్త 3లో

నేటి నుండి లేపాక్షి హస్తకళల ప్రదర్శన

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన హస్త కళాకారులు కళానైపుణ్యంతో రూపొందించిన హస్తకళారూపాలు. సందర్శకులను కనువిందు చేయనున్నాయని ఈనెల 31 నుండి పదిరోజులపాటు లేపాక్షి హస్త కళా ప్రదర్శన, అమ్మకాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర హస్త కళల అభివద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ యం. బాలసుబ్రమణ్యం రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోగల సిద్దార్థ హోటల్ మేనేజ్మెంట్ కళాశాల ఆవరణంలో జాతీయ స్థాయి హస్త కళాల ప్రదర్శన లేపాక్షి క్రాఫ్ట్ బజార్ - 2023 నిర్వహిస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ యం. బాలసుబ్రమణ్యం రెడ్డి తెలిపారు. దేశంలోని కర్నాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, రాజస్థాన్, మహారాష్ట్ర, బీహార్, ఒరిస్సా, తెలంగాణ తదితర రాష్ట్రలతో పాటు ఆంధ్రప్రదేశ్లో పేరుగాంచిన హస్త కళా ఉత్పత్తులను ప్రదర్శనలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పాల ఉత్పత్తిదారుల సమావేశం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం గ్రామంలో ధ్రుతి కృష్ణ పాల ఉత్పత్తిదారుల సంఘం రెండో వార్షికోత్సవ సమావేశం రెడ్డిగూడెం మండల కేంద్రమైన అగ్రికల్చర్ కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి బోర్డ్ సభ్యులు, రైతులు, వ్యవసాయ అధికారులు సుస్థిర వ్యవసాయ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విచ్చేసిన మండల వ్యవసాయ అధికారి ఏవో సురేష్ మాట్లాడుతూ రైతులందరూ సంఘంలో జాయిన్ అయి కలిసికట్టుగా ఉండి తమ ఉత్పత్తులను ధ్రుతి కృష్ణ రైతు సంఘం ద్వారా మార్కెటింగ్ చేసుకుని అధిక లాభాలు ధరించొచ్చని ఆర్గానిక్ సర్టిఫికెట్ ఉచితంగా పొందొచ్చని తెలిపారు. ధ్రుతి కృష్ణ రైతు సంఘం చైర్మన్ గోగులమూడి శ్రీనివాసరెడ్డి సంఘంలో రైతులందరూ చేరి వారి ఉత్పత్తులను విలువ గొలుసులు జోడించి గ్రేడింగ్ చేసి అమ్మాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌టి మహేష్‌నాథ్‌రెడ్డి, సుస్థిర వ్యవసాయ కేంద్రం సిబ్బంది రవి, ప్రశాంతి, భరత్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్‌టిఐ చట్టంపై అవగాహన

చందర్లపాడు : మండల కేంద్రమైన చందర్లపాడులో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పౌర సమాజ ఐక్య సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామ-వార్డు సచివాలయ సిబ్బందికి ఆర్‌టిఐ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిఒ ఎంఎస్ నెంబర్ 437 ప్రకారం గ్రామ సచివాలయాల్లో గ్రేడ్ 5, గ్రేడ్ 6 కార్యదర్శులుగా పనిచేయుచున్న అధికారులను పిఐఒ ఎపిఐఒలుగా నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. సచివాలయాల్లోని పిఐఒ, ఎపిఐఒలకు సమాచార హక్కు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త పౌర సమాజ ఐక్య సేవ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కొరగంటి హనుమంతరావు చట్టంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఉద్యోగస్తులు సమర్ధత గల వారిగా ప్రజలకు సేవలందించాలి అంటే సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసామ్య పరిరక్షణ సంస్థ సభ్యులు పారుపల్లి సత్యనారాయణ, ఎంపిడిఒ, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సెక్రటేరియట్‌లోని గ్రేడ్ 5, గ్రేడ్6 అధికారులు పాల్గొన్నారు.

ఎంపి గోరంట్ల మాధవ్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి మైలవరం : చంద్రబాబునాయుడిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హిందూపురం ఎంపి గోరంట్ల మాధవ్‌పై చర్యలు తీసుకోవాలని మైలవరం పోలీస్ స్టేషన్లో మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు సోమవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కృతజ్ఞత సభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సామినేని

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : నవంబర్ 2న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటుచేసిన బుడగ జంగాల కతజ్ఞత సభ వాల్ పోస్టర్‌ను ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని ఊర చెరువు వద్ద జరిగిన కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిల్లకల్లు గ్రామం జంగాల కాలనీకి చెందిన నాయకులు రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభానుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నవంబర్ 2న జరగనున్న కార్యక్రమ వివరాలను ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

గ్రామాల్లో 'హర్ దిల్ మే వైఎస్సార్'

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : హర్ దిల్ మే వైఎస్సార్ - హమ్ సబ్ జగన్‌కె సాథ్ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశానుసారం రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను సూచనల మేరకు ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్ ఆగస్టు నుండి నియోజకవర్గ వ్యాప్తంగా ముక్త్యాల, జయంతిపురం, వేదాద్రి, చిల్లకల్లు గౌరవరం, నవాబుపేట, మంగోల్లు, దేచుపాలెం, అనిగండ్లపాడు తదితర గ్రామాల్లో హర్ దిల్ మే వైయస్సార్ - హమ్ సబ్ జగన్ కె సాథ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మౌలిక వసతులు కల్పించాలి

కలెక్టర్‌కు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి.ఆంజనేయులు వినతి


జిల్లా కలెక్టర్ డిల్లీరావుకు వినతిపత్రం ఇస్తున్న ఆంజనేయులు తదితరులు

ప్రజాశక్తి - మైలవరం : పేదలకు ఇచ్చిన జగనన్న లేఅవుట్‌లలో మౌలిక వసతులు కల్పించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి.ఆంజనేయులు డిమాండ్ చేశారు. జి.కొండూరు మండలం వెలగలేరు గ్రామంలో లబ్ధిదారులకు ఇచ్చిన లేఔట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సోమవారం విజయవాడలో జిల్లా కలెక్టర్ డిల్లీరావుకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2020వ సంవత్సరంలో వెలగలేరు గ్రామ హెచ్.ముత్యాలంపాడు పరిధిలో 240 మందికి ఇళ్లపట్టాలిచ్చారని నేటికీ ఈ కాలనీలో కనీస సౌకర్యాలైన తాగునీరు, రహదారులు, విద్యుత్ సౌకర్యం కల్పించలేదన్నారు. కనీస సౌకర్యాలు కల్పిస్తే ఇల్లు కట్టుకుంటామని లబ్ధిదారులు అధికారుల చుట్టూ తిరిగిన వారు పొంతన లేని సమాధానాలు చెప్తున్నారన్నారు. బుడమేరు వరద ముంపు ప్రాంతమైన హెచ్.ముత్యాలంపాడు వద్ద భూమిని కొనుగోలు చేయటంపై గతంలో కొంతమంది నాయకులపై ఆరోపణలు, వచ్చాయని ఇప్పుడు అదే నాయకులు పేదలను బెదిరిస్తూ ఇల్లు కట్టుకోండి కట్టుకున్న తర్వాత మౌలిక వసతులు కల్పిస్తామని లేకపోతే పట్టాలు వెనక్కి లాక్కుంటామని బెదిరిస్తున్నారన్నారు. ఇది మంచి పద్ధతి కాదని అధికారులు స్పందించి వెంటనే మౌలిక వసతులు కల్పించాలని కోరారు. జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, సిఐటియు జి కొండూరు మండల కార్యదర్శి కే బాలకష్ణ, సిఐటియు నాయకులు ఎర్రగుంట కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎస్‌టిలకు ప్రత్యేక స్థానం


మాట్లాడుతున్న సామినేని ఉదయభాను

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : రాష్ట్రంలోనే ఎస్టీ సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక స్థానం కల్పించారని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. మండలంలోని ధర్మవరప్పాడు తండా జెండా చెట్టు సెంటర్ నందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ఎస్‌టి సెల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్‌టి సామాజిక వర్గాన్ని అన్ని రంగాల్లో ప్రత్యేక స్థానం కల్పించి వారి హదయాలలో చిరస్థాయిగా నిలిచారన్నారు. గ్రామ ప్రజలు ఫంక్షన్ హాల్ కావాలని కోరగా త్వరలో ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. అనంతరం మండలంలో గ్రామ, మండల పార్టీ పలు విభాగాల అధ్యక్షులకు పార్టీ అభివద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు మండవ శ్రీనివాస్ గౌడ్, చేనేత విభాగం అధ్యక్షులు పెంటి శ్రీనివాస్, మండల సచివాలయల కన్వీనర్ షాబుద్దీన్, యూత్ అధ్యక్షులు బజారు సాయి, బీసీ విభాగం చాపల వెంకటేశ్వర్లు, మహిళా విభాగ అధ్యక్షురాలు కాసరగడ్డ సీత, తదితరులు పాల్గొన్నారు.

ఎండిన వరిపంటకు నష్టపరిహారమివ్వాలి



ధర్నా చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - తిరువూరు : వర్షాభావ పరిస్థితులకు ఎండిపోయిన వరిపంటకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు తిరువూరు మండలం మునుకుళ్ళ గ్రామ సచివాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వర్షాలు కురవకపోవడంతో వరి పంట పొట్టదశలో, కంకి దశలో ఉన్న సమయంలో తీవ్రమైన నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. దీంతో ఎకరానికి దాదాపు రూ.30,000 వరకు పెట్టుబడి పెట్టిన లబోదిబోమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తిరువూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి ఎకరానికి రూ.30,000 నష్టపరిహారం ఇవ్వాలని, బ్యాంకుల ద్వారా రైతులు తీసుకున్న రుణాలను రద్దుచేయాలని, పశువులకు పశుగ్రాసం కోరకు విత్తనాలు సరఫరా చేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సచివాలయ కార్యదర్శికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వేమిరెడ్డి నాగి రెడ్డి, వెదురు కోటారెడ్డి, వెల్లంకి.అప్పారావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరివ్వాలని వినతి

ప్రజాశక్తి - నందిగామ : ప్రతి ఇంటికీ తాగునీరివ్వాలని టిడిపి నాయకులు ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. జలజీవన్ మిషన్ 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొని ప్రారంభించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో అది ఆగిపోయిందని సంవత్సరం క్రితం అక్కడక్కడా పనులు ప్రారంభించినా నాసిరకం పైపులు వాడటంతో నాణ్యత లోపిస్తుందన్నారు. కొన్ని గ్రామాల్లో పైప్ లైన్లు వేసి పనులు నిరుపయోగంగా ఉన్నాయని మరికొన్ని గ్రామాలకు నిధులు మంజూరు కాలేదని అన్నారు. ఇప్పటికైనా ఇంటింటికీ తాగునీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వీరస్వామిన్ ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు (బుజ్జి) కష్ణ మిల్క్ యూనియన్ డైరెక్టర్ నెలకుదిటి నాగేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జ ఉన్నం అప్పారావు, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు వేల్పుల బిక్షాలు, తదితరులు పాల్గొన్నారు.

అరెస్టుపై కొనసాగిన నిరసనలు

చందర్లపాడు : చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ మండల కేంద్రమైన చందర్లపాడులో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబుపై అక్రమ కేసులు మానుకోవాలని, రైతన్నలను ఆదుకోవాలని తెలుగుదేశం నాయకులు నినదించారు. అనంతరం పత్తిపొలాలను సందర్శించి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మేకల సుధాకర్, రైతు నాయకులు దుద్దుకురి శ్రీను, పాపోలు మాధవ పాల్గొన్నారు.

48 రోజుకు చేరుకున్న రిలే దీక్షలు

మైలవరం : మైలవరంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం 48వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో స్థానిక తెలుగు యువత నాయకులు కూర్చున్నారు. జి.కొండూరు మండల పార్టీ అధ్యక్షుల పజ్జూరి రవికుమార్ ఈ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. **పెనుగంచిప్రోలు :** మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య ఆధ్వర్యంలో నిజం గెలవాలి కళ్ళు తెరిపిద్దాం కార్యక్రమాలను మండల కేంద్రంలో నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు కళ్ళకు గంతలు కట్టుకొని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి గజ్జి కృష్ణమూర్తి మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్ బాబుచుంచు రమేష్ బాబు గ్రామపార్టీ అధ్యక్షులు కొత్తపల్లి సతీష్ నల్లపునేని కొండ కొలిపాక బ్రహ్మం కర్ల నాగేశ్వరరావు మహమ్మద్ అజాద్ ముండ్లపాటి రాము కంచిపోగు రవి చిరంజీవి. తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ నారా భువనేశ్వరి, లోకేష్‌కి సంఘీభావం తెలిపేందుకు మంగళగిరి వరకు తలపెట్టిన శాంతియుతంగా "న్యాయపోరాట పాదయాత్ర" కు ఉదయాన్నే బయలుదేరిన జగ్గయ్యపేట నియోజకవర్గ టిడిపి తెలుగుమహిళ అధ్యక్షురాలు కన్నె బోయిన రామలక్ష్మి ప్రసాద్‌ని హౌస్ అరెస్ట్ చేశారు.


పరామర్శించేందుకు వచ్చిన ఉమా

నిమ్మగడ్డ నారాయణరావు కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు తెలుగుదేశం పార్టీ నాయకులు నిమ్మగడ్డ నారాయణరావు కుటుంబ సభ్యులను టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు పరామర్శించారు. నారాయణ రావు సతీమణి కస్తూరి అకాల మరణం చెందగా సోమవారం మూలపాడులోని వారి స్వగృహంలో ఆమె మృతదేహానికి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నేతలు పాల్గొన్నారు.

మద్య నిషేధం అమలు చేయాలి

ప్రజాశక్తి - భవానీ పురం : రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధం అమలు చేయాలని గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు గాంధీ నాగరాజన్ డిమాండ్ చేశారు. సోమవారం ఊర్మిళానగర్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో మహాత్మా గాంధీని గాడ్సే హత్య చేసిన జనవరి 30వ తేదీని పురస్కరించుకొని ప్రతి నెల 30వ తేదీన చేస్తున్న రీతిలోనే కళ్లకు గంతలు కట్టుకుని సత్యాగ్రహ నిరాహారదీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో గాంధీదేశం ట్రస్ట్ మహిళా అధ్యక్షురాలు ఆర్ఎన్.శివరంజని, ట్రస్ట్ ఏపీ అధ్యక్షురాలు బి. భారతి పాల్గొన్నారు.


ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కళాశాల బస్సులతో ఇబ్బంది

ప్రజాశక్తి - గంపలగూడెం : సోమవారం స్పందనలో పలు సమస్యలపై అర్జీలు వచ్చినట్లు ఎంపిడిఒ వైపిరెడ్డి తెలిపారు. స్థానికంగా ఉన్న విశిష్ట కళాశాల, సరస్వతి స్కూల్ బస్సుల రద్దీతో ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు సోమవారం జరిగిన స్పందనలో ఫిర్యాదు చేశారు. రహదారి వెంట ఉన్న అంగన్వాడీ పిల్లలు తినే ఆహారంలో సైతం దుమ్ము ధూళి పడి ఇబ్బంది పడుతున్నట్లు అర్జీ వచ్చినట్లు తెలిపారు. కనుమూరు నుండి వడ్డే పోయిన వెంకటరమణ తన సోదరుడు తన ఇంటిని స్వామిత్వ సర్వే జరగకుండా అడ్డుకున్నాడని, తునికిపాడు నుండి వృద్ధాప్య పింఛను కోరుతూ మరో అర్జీ వచ్చినట్లు తెలిపారు.

బావిలో పడి కౌలురైతు మృతి



ప్రజాశక్తి - వత్సవాయి : ప్రమాదవశాత్తు కౌలురైతు బావిలో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని కన్నె వీడు గ్రామంలో చోటు చేసు కుంది. ఆ గ్రామానికి చెందిన ధారావత్ కష్ణ (34) రోజువారీగా పొలం దగ్గరికి వెళ్లి పనులు చేస్తు మంచినీళ్ల కోసం బావి దగ్గరికి వెళ్ళగా ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. దీంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆ ఎస్ఐ అభిమన్యు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.


మాట్లాడుతున్న గీతాబాయి

రోగులను రిఫరల్ ఆసుపత్రులకు పంపాలి : గీతాబాయి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గుర్తించిన రోగులను సమీపంలో రిఫరల్ సేవలు అందుబాటులో ఉన్న వైద్యశాలలకు, నెట్వర్క్ వైద్యశాలలకు రెఫరల్ చేసి వారికి కావలసిన వైద్య సేవలను అందేవిధంగా చర్యలు తీసుకోవాలని డాక్టర్ జి గీతాబాయి సూచించారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం లో డాక్టర్ జి గీతాబాయి అధ్యక్షతన జిల్లాలోని క్షేత్రస్థాయి పర్యవేక్షక సిబ్బంది తో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నెలవారి ప్రగతి నివేదికలపై సమీక్ష సమావేశము నిర్వహించినారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు వైద్యాధికారులకు సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేసినారు .అదేవిధంగా జిల్లాలో నిర్వహించిన కంటి వెలుగు స్క్రీనింగ్ కార్యక్రమంలో గుర్తించిన దష్టిలోపం ఉన్నవారికి కావలసిన కళ్ళజోళ్ళ పంపిణీ మరియు కాట్రాక్ట్ చేయించవలసిన వారికి త్వరలో అందుబాటులో ఉన్న ప్రాంతాలలో నిర్వహించే క్యాంపులో నందు కాంట్రాక్ట్ చేయించవలసినదిగా ఆదేశించినారు. అదేవిధంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమం ద్వారా నిర్వహించవలసిన గర్భవతుల నమోదు చిన్న పిల్లలకు టీకాల కార్యక్రమాలు సకాలంలో నిర్వహించలన్నారు. .ముఖ్యంగా గర్భవతుల్లో ఉన్న ప్రమాదకరమైన గర్భిణీ కేసులను గుర్తించి వారు కాన్పు ఆ య్యేంత వరకు ఎస్కార్ట్ ను ఏర్పాటు చేసి కాన్పులు సజావుగా జరిగే విధంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు. .ఫ్యామిలీ డాక్టర్ విధానములో నిర్వహించే క్యాంపు లలో వారి పరిధిలో ఉన్నటువంటి అంగన్వాడీ సెంటర్లు ,పాఠశాలలు మరియు కళాశాలలోని విద్యార్థులను 6నెలల నుండి 18 సంవత్సరాల వయసు వరకు ఉన్న వారి లో ఏవైనా లోపాలు ఉంటే పరీక్షించి తగిన చర్యలుచేపెట్టాలన్నారు. అదేవిధంగా వారిలో ఉన్న రక్తహీనతను గుర్తించి నివారణ కొరకు ఎర్ర మాత్రలు , సిరప్పులను పంపిణీ చేయాలన్నారు . ఆరోగ్యశ్రీ ద్వారా గర్భవతులకు ఉచిత కాన్పులు జరిగే విధంగా తగిన సలహాలు, తగిన సేవలు అందించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న అడల్ట్ బీసీజీ టీకా కార్యక్రమం కొరకు కావలసిన అర్హులైన వారి జాబితాలను రూపొందించి రాబోయే నవంబర్ నెల రెండో వారం నుండి వారికి బీసీజీ టీకా ను ఇప్పించుటకు తగిన ప్రణాళికలను రూపొందించాలన్నారు. అలాగే జిల్లాలో మాత మరణాలను, శిశు మరణాలను తగ్గించుటకు క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. వెక్టార్ హైజిన్ యాప్ ద్వారా వచ్చే సమస్యలను సకాలంలో పరిష్కరించాలన్నారు. జిల్లాలో ప్రజలందరూ వారి అవసరాలు మీరకు 104, 108 మరియు తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ సేవలను ఉపయోగించునేల సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వెంకట్రావు డిటిసిఓ, సీతాకుమారి, వై మహేష్ , విజయభారతి , కె రత్నగిరి, జిల్లా మలేరియా అధికారి బి రామారావు, బి శివసాంబి రెడ్డి ,ఆనంద్ యస్.ఓ., వునాగ భవాని, శాస్త్రి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం:** కేసరపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించ్ఛారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ సత్య కుమార్, ఎంపీపీ అనగాని రవి మాట్లాడుతూ ఆరోగ్య భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పథకానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. అనంతరం 902 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీ మౌనిక, ఎంపిటిసి సభ్యులు సాతులూరి శివ నాగరాజకుమారి, పంచాయతీ కార్యదర్శి మౌనిక, జడ్పిటిసి ఎలిజబెత్ రాణి, పిఓపిఆర్డి వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు. **గుడివాడ :** స్థానిక 36వ వార్డులోని బిసి సంక్షేమ వెల్ఫేర్ హాస్టల్లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, వైసిపి పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.


గుడివాడలో...

ప్రజా సేవకులు నరసింహారావు

సంతాప సభలో వక్తలు

ప్రజాశక్తి-పెదపారుపూడి: పామర్రు మండలం కురుమద్దాలి గ్రామ మాజీ సర్పంచ్ గుళ్లపల్లి నరసింహారావు ప్రజా సేవకుడని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక కమ్యూనిటీ హాల్లో ఒడుగు గంగాధర్ అధ్యక్షతన సోమవారం గుళ్లపల్లి నరసింహారావు సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర నాయకులు పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ నరసింహారావు 20 సంవత్సరాల పాటు సర్పంచ్‌గా సేవలు అందించారన్నారు. కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ నరసింహారావు చివరి వరకు ఎత్తిన జెండా విడవలేదన్నారు. సిపిఎం సిద్ధాంతానికి కట్టుబడి ఒక సేవకుడిగా ప్రజలకు సేవ చేశారన్నారు. కురుమద్దాలి గ్రామ సర్పంచ్ గోట్రు విజయభారతి మాట్లాడుతూ ఆయన బాటలో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు నీలం మురళీకృష్ణ, ఆర్‌సిపి రెడ్డి, బరిగెల భీమేశ్వరరావు, నరసింహారావు, సిఐటియు మండల కార్యదర్శి ఉప్పలపాటి అనూష తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరరావుకు పిహెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి-బంటుమిల్లి: మండలంలోని పెదతుమ్మిడి గ్రామానికి చెందిన దాసరి సుబ్రహ్మణ్యేశ్వరరావుకు పిహెచ్‌డి ప్రదానం చేసినట్లు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డా. పి.కిరణ్మయి తెలిపారు. సుబ్రహ్మణ్యేశ్వరరావు కృష్ణాజిల్లా గుడివాడ మండలం నాటక రచయితల నాటకాలు -ఒక పరిశీలన అనే అంశం మీద చేసిన పరిశోధనకు పర్యవేక్షకులుగా డా. బూసి వెంకటస్వామి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎఎన్‌యు విసి ప్రొఫెసర్ పి రాజశేఖర్, ఆర్ట్స్ కామర్స్ అండ్ లా కళాశాలల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి, తెలుగు శాఖాధ్యక్షులు ప్రొఫెసర్ మాధవి అభినందనలు తెలిపారు.



అవనిగడ్డకు సాగునీరు తీసుకురండి : టిడిపి

ప్రజాశక్తి-అవనిగడ్డ: రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎమ్మెల్యే రమేష్‌బాబు అవనిగడ్డకు సాగునీరు తీసుకురావాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు నోరు పారేసుకున్నందుకే ఖమ్మంలో టిడిపి, జనసేన నేతలు నిరసన వ్యక్తం చేశారన్నారు. నియోజకవర్గంలో రైతులు సాగునీరు లేక తమ పొలాలు ఎండిపోతున్నాయని గగ్గోలు పెడుతుంటే తన మిత్రుడు రాంబాబుని అడిగి నీళ్ల తీసుకురాలేని ఎమ్మెల్యే మిత్రుడిపై దాడి జరిగిందంటూ ప్రెస్‌మీట్‌లు పెట్టి ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసం అంటూ ప్రశ్నించారు. రైతులకు అన్యాయం జరిగితే పట్టించుకోకుండా మిత్రుడికి అన్యాయం జరిగిందని గగ్గోలు పెడుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, బండే రాఘవ, ఘంటసాల రాజమోహన్రావు, మండలి రామ్మోహన్రావు తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

స్పందన అర్జీల పట్ల ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్ఓ పెద్ది రోజా, మచిలీపట్నం ఆర్డిఓ ఎం వాణిలతో కలిసి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి విజ్ఞాపన పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రజలు వివిధ ప్రాంతాల నుండి ఎంతో శ్రమకోర్చి వ్యయప్రయాసలతో జిల్లా కేంద్రానికి వస్తున్నారని స్పందన అర్జీలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంకేతిక పోటీలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల రజతోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం జాతీయస్థాయి ప్రాజెక్ట్ ఎన్విజన్, టెక్ ఇన్నోవెంట్ హాంకథాన్ సాంకేతిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ట్రానిక్స్ సిస్టమ్స్ డైరెక్టర్ బి.సాంబిరెడ్డి



మాట్లాడుతూ రైల్వే ట్రాకింగ్ వ్యవస్థ, సిగ్నలింగ్, ట్రాఫిక్ వ్యవస్థలో భారత రైల్వే అద్భుతంగా రూపొందించి, కార్యచరణలో పెట్టిందని అన్నారు. డ్రైవర్‌ను ట్రాకింగ్ వ్యవస్థతో అనుసంధానం చేసే ప్రక్రియను మెరుగుపరిచే ఆధునిక సాంకేతికతను రూపొందించి పాశ్చాత్య దేశాలకు ధీటుగా భారతదేశ రైల్వే వ్యవస్థ ముందంజలో ఉందన్నారు. రజతోత్సవ కన్వీనర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.కామరాజు మాట్లాడుతూ ప్రాజెక్ట్ మోడల్ పోటీల్లో 88 మంది, రోబో రేస్ పోటీలో 20 మంది, అటానమస్ వాహనాల పోటీల్లో 12 మంది పాల్గొన్నారన్నారు. 24 గంటల పాటు సాగిన హ్యాక్ దాన్ పోటీలో 340 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. సీనియర్ టెక్నికల్ మేనేజర్ వడ్లమాని మధు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ పి కోదండ రామారావు, డాక్టర్ ఎం ఆర్ సి హెచ్ శాస్త్రి, యాజమాన్య సలహాదారులు డాక్టర్ పి రవీంద్రబాబు, డాక్టర్ బి.కరుణకుమార్ పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులివ్వాలని రైతుల ధర్నా

ప్రజాశక్తి-మోపిదేవి: దళారుల చేతిలో మోసపోకుండా ప్రతి గింజకు గిట్టుబాటు ధర చెల్లించి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేస్తుంది అంటూ ఎంతో ప్రగ ల్భాలు చెప్పిన ప్రభుత్వం నేటికీ నెలలు గడిచిన రైతులు తోలిన ధాన్యంరవాణా ఖర్చులు చెల్లించకపోవడంతో ఆర్బీకే వద్ద ఆందోళన చేపట్టాల్సిన దుస్థితి రైతులకు ఏర్పడింది. మోపిదేవి మండలం కే కొత్తపాలెం గ్రామానికి చెందిన రైతులు దాదాపు 1000 ఎకరాల్లో పండించిన ధాన్యం పిఎసిఎస్ ద్వారా ప్రభుత్వానికి విక్రయించారు. ఈ ఏడాది ప్రారంభంలో జనవరి నుండి ఫిబ్రవరి, మార్చి నెలలో పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి రైతులు అమ్మకాలు చేపట్టారు. ధాన్యాన్ని అమ్మే సమయంలో వాహన రవాణా చార్జీలు, హమాలీ చార్జీలు ప్రభుత్వం నేరుగా రైతుల అకౌంట్లోకి జమ చేస్తామని అప్పట్లో హామీ ఇచ్చినప్పటికీ ఎనిమిది నెలలు గడుస్తున్న రైతులకు చెల్లించాల్సిన రవాణా చార్జీలు, హమాలీ చార్జీలు చెల్లించకపోవడంతో కే కొత్తపాలెం గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ ,జనసేన పార్టీల శ్రేణులు సైతం బాసటగా నిలిచారు. ఇటీవల రెండు రోజుల క్రితం రైతు భరోసా కేంద్రానికి విచ్చేసిన మండల వ్యవసాయ శాఖ అధికారులు రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. రైతులు ధాన్యాన్ని అమ్మిన సమయంలో చెల్లించాల్సిన రవాణా, హమాలీ చార్జీలు ఎప్పుడు చెల్లిస్తారంటూ ప్రశ్నించడంతో అధికారులు కాంట్రాక్టర్కు ఫోన్ చేయగా రైతులకు చెల్లించాల్సిన బకాయిలు గ్రామానికి చెందిన బాబురావు ఖాతాలో జమ చేయమని ఎమ్మెల్యే కార్యాలయం



నుండి ఫోన్ ద్వారా తెలియజేయడంతో , అతని ఖాతాలో జమ చేయడం జరిగిందని సమాధానం ఇచ్చారు. రైతులకు చెల్లించాల్సిన డబ్బులు ఎమ్మెల్యే చెప్పారని పార్టీకి చెందిన వైసీపీ కార్యకర్తకు జమ చేయడంపై రైతులు ఆందోళన బాట పట్టారు. ధాన్యానికి గిట్టుబాటు ధర రాక నామమాత్రపు ధరతో విక్రయాలు జరపగా ఆసరాగా నిలుస్తాయి అనుకున్న హామాలి చార్జీలు, రవాణా చార్జీలు సైతం వైసీపీ కార్యకర్తల ఖాతాలోకి జమ చేసిన వైనంపై రైతులకు న్యాయం చేయాలి అంటూ ప్రభుత్వం తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించని పక్షంలో తీవ్ర స్థాయిలో ఆందోళన చేపట్టాల్సి వస్తుందని రైతులు, టిడిపి జనసేన నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు దుట్టా రవీంద్రనాథ్ ఠాగూర్, రామకష్ణ ,చందన రంగారావు ,పూషడపు రత్న గోపాల్ ,చందన సుబ్బారావు.వంశీ. ప్రభు పాల్గొన్నారు.

తరిగొప్పలలో పంటల పరిశీలన

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం): తరిగొప్పల గ్రామంలోని పంట పొలాలను టిడిపి బృందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా టిడిపి గన్నవరం నియోజకవర్గ ఇన్చార్జి యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో దయనీయమైన పరిస్థితి నెలకొందని యువతకు ఉద్యోగాలు లేక సామాన్య ప్రజలు పనిలేక వారిని అనేక రకాలు ఇబ్బందులు గురి చేస్తూ ప్రశ్నిస్తే అక్రమ కేసులతో ఇబ్బందులు పెడుతూ ప్రజల్ని ఇబ్బందులు గురి చేయడం సరికాదని అన్నారు. నీరు లేక పొలాలు ఎండిపోతున్నాయని, వెంటనే రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండల అధ్యక్షులు అరుమల్ల కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి అల్ల హనుక్, మండల మహిళా అధ్యక్షురాలు మండవ రమ్య, గ్రామ అధ్యక్షులు గోగినేని విష్ణు వర్ధన్ రావు, ఫిరోజ్, సుబాన్ అలి, శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు మండలం కప్పలదొడ్డి జిల్లా పరిషత్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాల్ బ్యాడ్మింటన్ అండన్-14 విభాగంలో పి.పవన్ నాగ శ్రీ సాయి, ఎం.సోనాష్, అండర్ 17 బాలికల విభాగంలో కే దేవి ప్రియ, కె.చంద్ర పావని ఎంపికయ్యారు. గ్రామ సర్పంచ్ యక్కల మాధవి నాగరాజ్, ఎంపీటీసీ పేరిశెట్టి తేజవతి మధు, స్కూల్ పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ యక్కాల రమేష్, స్కూల్ డ్రిల్ మాస్టర్ సిహెచ్ మురళీకృష్ణ, స్కూల్ హెడ్మాస్టర్ ఎం జ్యోతి విద్యార్థులను అభినందించారు.





హుండీ కౌంటింగ్‌ను పర్యవేక్షణ చేస్తున్న దుర్గగుడి ఇఒ రామారావు

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ. 2.58 కోట్లు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి మహా మండపం ఆరవ అంతస్తులో సోమవారం హుండీ ఆదాయం లెక్కించారు. మొదటి రోజున హుండీ లెక్కింపు సందర్భంగా నగదు రూ.2,58,64,740లు, బంగారం: 367 గ్రాములు, వెండి: 8 కేజీల 745 గ్రాములు భక్తులు హుండీ ద్వారా సమర్పించుకున్నారు. ఈ మేరకు హుండీ లెక్కింపును ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్ రామరావు, దేవాదాయ శాఖ అధికారులు, ఎస్‌పిఎఫ్, వన్‌టౌన్ పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు. 31వ తేదీ మంగళవారం కూడా హుండీ లెక్కింపు కొనసాగుతుందని దేవాలయం అధికారులు తెలిపారు.

మాజీ సర్పంచ్ 'గుర్రం' మృతి

ప్రజాశక్తి - గంపలగూడెం : మండలంలోని పెద్ద కొమెర గ్రామ తొలి సర్పంచ్, ప్రాథమిక సహకార సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గుర్రం నారాయణరావు (100) మృతి చెందారు. కొంతకాలం అనారోగ్యంతో బాధపడుతూ, సోమవారం ఉదయం మృతిచెందారు. ఆయనకు కుమారుడు, అయిదుగురు కుమార్తెలు న్నారు. నారాయణరావు గ్రామ తొలి సర్పంచ్‌గా వరుసగా ఐదు పర్యాయాలు కొనసాగడం విశేషం. మతదేహాన్ని టిడిపి వైసిపి సిపిఎం నాయకులు సందర్శించి నివాళులర్పించారు.



మెట్ల మార్గం పనులు ప్రారంభం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : 52వ డివిజన్ పరిధిలోని మల్లికార్జున పేట ఉప్పరవాగులో 4.50 లక్షల రూపాయల వ్యయంతో జరుగుతున్న మెట్లమార్గం పనులను ప్రారంభిస్తున్న 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) మున్సిపల్ కాంట్రాక్టర్, సచివాలయం సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.



ఎల్‌విఆర్ వర్ధంతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : లింగాల వెంకటేశ్వరరావు వర్ధంతి కొండపల్లి క్రాంతి కాన్వెంట్‌లో సోమవారం జరిగింది. సిపిఎం కొండపల్లి టౌన్ కమిటీ ఆధ్వర్యంలో కొండపల్లి 1 శాఖ కార్యదర్శి చింతల శివ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు ఎ.విఠల్‌రావు, డాక్టర్ ఎం సీతారామారావు, మాజీ సర్పంచ్ వి.అమ్మాజీ, జెవివి జిల్లా అధ్యక్షుడు వి.మురళీ మోహన్, పి.కామేశ్వరరావు, ఎల్ పార్వతీ, వారి కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు కొండలరావు నారాయణ బాబ్జి బాషా శ్రీను పార్టీ పట్టణ కమిటీ కార్యదర్శి ఎం.మహేష్ తదితరులు పాల్గొని మాట్లాడారు. ఎల్‌విఆర్ కొండపల్లిలో పార్టీ నిర్మాణానికి కషి చేశారన్నారు. ఎపిహెచ్‌ఎంఎల్ సంస్థలో సిఐటియు యూనియన్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎం.సీతారామారావు

15న బహిరంగ సభ జయప్రదం చేయండి

చందర్లపాడు : మండల కేంద్రమైన చందర్లపాడులో మంగళవారం సిపిఎం చందర్లపాడు శాఖ సమావేశం ఏ చిన్నశ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కమిటీ సభ్యులు చనుమోలు సైదులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు పూర్తిగా వైఫల్యం చెందాయని విమర్శించారు. అసమానతలు లేని రాష్ట్ర అభివద్ధే లక్ష్యంగా సిపిఎం నవంబర్ 15న విజయవాడ మాకినేని బసవ పున్నయ్య స్టేడియం సింగ్‌నగర్‌లో భారీ బహిరంగ సభ జరుగుతుందని చందర్లపాడు మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలందరూ పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి షేక్.హస్సాన్ సభ్యులు ఏ.చిన్న శ్రీనివాసరావు ఎస్.కె వద్దండు కె సీతారావమ్మ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు చూపుతున్న దృశ్యం

ఆరోగ్య సురక్ష సందర్శన


ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని 37, 41, 43, 44, 45, 54 డివిజన్లలోని 6 సచివాల యాలో పరిదిలో సోమవారం నాడు జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ఎంఎల్ఎ వెలంపల్లి శ్రీనివాస రావు సందర్శించారు. అనంతరం వైద్య పరీక్షలు, మందులు పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు మండెపూడి ఛటర్జీ, ఎమ్‌డి.ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, మైలవరపు రత్నకుమారి, మైలవరపు దుర్గారావు, మైలవరపు మాధురి లావణ్య, అబ్దుల్ అర్షద్ అకీబ్, పడిగపాటి చైతన్య రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మనోజ్ కొఠారి, జిల్లా వైద్య శాఖాధికారి సుహాసిని, తదితర కార్పొరేటర్లు, పార్టీ నాయకులూ కార్యకర్తలు అభిమానులు తదితరులు సచివాలయం కన్వీనర్లు గహ సారథులు నగర పాలక సంస్థ అధికారులు సచివా లయం సిబ్బంది, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.



క్యాంపును పర్యవేక్షిస్తున్న వెలంపల్లి,తదితరులు

యుటిఎఫ్ నూతన కార్యవర్గాలు

ప్రజాశక్తి - తిరువూరు : యుటిఎఫ్ ఎ.కొండూరు మండల కమిటీ సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం జరిగింది. సందర్భంగా నూతన కంపెనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులు బివి.దుర్గారావు, అధ్యక్షులుగా వి.తేజస్విని, సహాధ్యక్షులు బి.శ్రీరాములు, సహాధ్యక్షురాలు బి.కష్ణకుమారి, ప్రధాన కార్యదర్శిగా జి.ఇసాక్, కోశాధికారిగా ఎస్.లక్ష్మి నారాయణ, ఆడిట్ కన్వీనర్‌గా బి.నాగేంద్రరావు, జిల్లా కౌన్సిలర్స్‌గా బి.సూర్య, కె.ఎ.మంగమ్మ, పి.లీల, బి.విశ్వభారతి, కార్యదర్శులుగా బి.భాంగ్య, బివి.కష్ణారెడ్డి, ఎం.సామ్రాజ్యం, ఎ.రవీంద్రబాబు, జి.రామయ్య, బి.జెస్సీరాణి, ఎల్.చంటి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిణిగా యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా సహాధ్యక్షురాలు డి.అపర్ణ, పరిశీలకులుగా యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ ఉన్నారు. **వత్సవాయి :** సిపిఎస్, జిపిఎస్‌ను రద్దు చేయాలని వత్సవాయి మండల యుటిఎఫ్ అధ్యక్షులు అజ్మీర్ శ్రీను, ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. వత్సవాయి మండలం నూతన కార్యవర్గ సమావేశం వత్సవాయి మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో డి.సైదులు అధ్యక్షతన నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షులు ఎం.కష్ణయ్య జిల్లా కోశాధికారి మహేశ్వరి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. గౌరవ అధ్యక్షులుగా మీ గోవిందయ్య, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె.జానీ, సహాయ అధ్యక్షురాలు ఎం.మణి, కోశాధికారి ఇ.రామకష్ణ, కార్యదర్శిగా గోవిందరాజులు, ఎస్ కే జాన్, సునీల్ బాబు, కిరణ్మయి జ్యోతి రామకష్ణ, ఎం.వి.నరసింహారావు, ఆడిటర్‌గా గోదాటి సత్యనారాయణ రెడ్డి నియమితులయ్యారు. పలు ఉపాధ్యాయులు వారికి అభినందనలు తెలిపారు.



వి.తేజస్విని



బివి.దుర్గారావు



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ

ఉద్యోగ భద్రతకు వినతి

ప్రజాశక్తి - తిరువూరు : తమను పర్మినెంట్ చేసి, జీతాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని పారిశుధ్య కార్మికులు కోరారు. సోమవారం చైర్ పర్సన్ గత్తం కాస్తూరిభాయి అధ్యక్షతన జరిగిన తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో కార్మికులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. అరు సంవత్సరాల నుండి పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న తమకు నెలకు రూ.1500 మాత్రమే వేతనం ఇస్తున్నారని అన్నారు. వీరికి అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ మోదుగు ప్రసాద్ మద్దతుగా నిలిచారు. కరోన సమయంలో కూడా ప్రాణాలను లెక్కచేయ కుండా పనులు నిర్వహించామని, పర్మినెంట్ చేస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జీతంతో కుటుంబ పోషణ కూడా కష్టంగా ఉంటుందన్నారు. పట్టణంలో ఉన్న సమస్యలపై అధికారులను ప్రతిపక్ష టిడిపి కౌన్సిలర్లు హుసేన్, సురేంద్ర నిలదీశారు. తమ ప్రభుత్వంలో ఎక్కువ అభివద్ధి జరిగిందని అధికార పక్ష సభ్యులు ఎదురు దాడి చేశారు. దీనితో సమావేశం వాడి వేడిగా సాగింది.



అధికారుల ఎదుట గోడు వెళ్లబోసుకుంటున్న కార్మికులు

వాకింగ్ ట్రాక్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పర్యాటక కేంద్రంగా ఊర చెరువు అభివద్ధి పనుల్లో భాగంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వాకింగ్ ట్రాక్ సుందరీకరణ పనులను సోమవారం ప్రభుత్వవిప్, స్థానిక శాసనసభ్యులు సామినేని ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఊర చెరువు అభివద్ధి పనులను పరిశీలించి వాకింగ్ ట్రాక్‌కు ఇరువైపులా ఏర్పాటుచేసిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రభుత్వవిప్ ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ పట్టణ పౌరుల కోసం ఏర్పాటుచేసిన వాకింగ్ ట్రాక్ సుందరీకరణ పనులలో భాగంగా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకుగాను అందమైన ఆకర్షణీయమైన మొక్కలను వాకింగ్ ట్రాక్‌కు ఇరువైపులా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చెరువు అభివద్ధి పనులకు సంబంధించి చెరువు చుట్టూ ప్రహరీ, వాకింగ్ ట్రాక్ తదితర నిర్మాణ పనులు దాదాపు పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన పనులు కూడా త్వరలో పూర్తిచేసి పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర,మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్,పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ, ఎస్టి విభాగం అధ్యక్షులు బాద్దు నాయక్, పెనుగంచిప్రోలు సచివాలయాల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న సామినేని ఉదయభాను



బహిరంగ వేలం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం వార్షిక బహిరంగ వేలం పాటలు సోమవారం దేవాదాయశాఖ అధికారులు విజయవాడ సనేస్వర స్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జి.వి.కృష్ణా రావు పర్యవేక్షణలో వేలంపాటలు నిర్వహించారు. ఈ వేలం పాటలలో కొండపైన నూతనంగా నిర్మించిన 2 షాపులకు హెచ్చుపాటలు వచ్చాయి. షాప్ నెంబర్ 1 వేదాద్రి గ్రామానికి చెందిన తూమాటి నాగేశ్వర రావు రూ.2.1 లక్షలు, షాప్ నెంబర్ 2 తిరుమలగిరి గ్రామానికి చెందిన ఇమ్మడి వెంకటేశ్వరరావు రూ.2.81 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి సి.జయ ప్రకాశ్ బాబు తెలిపారు.



సామినేనితో గ్రామ అధ్యక్షులు, నాయకులు

నియామకం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో మండలంలోని వేదాద్రి గ్రామానికి చెందిన గుగులోత్ బుజ్జి నాయక్ వేదాద్రి గ్రామ పార్టీ అధ్యక్షులుగా నియమితులయ్యారు. గుగులోత్ శివా నాయక్ ఎస్టీ సెల్ నెంబర్‌గా నియమితులయ్యారు. గ్రామ సర్పంచ్ గుడారి పేరయ్య ఆధ్వర్యంలో నియమతులయ్యారు. ఈ కార్యక్రమంలో మండల బిసి సెల్ ప్రధాన కార్యదర్శి యర్రగొర్ల కోటేశ్వరరావు యాదవ్, గుగులోతు భోజ్య నాయక్, బాల, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - నందిగామ : సిసిఐ ద్వారా పత్తి క్వింటాకు మద్దతు ధర రూ.7,020 కల్పించనున్నట్లు నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్‌రావు పేర్కొన్నారు. సోమవారం రాత్రి నందిగామ వ్యవసాయ మార్కెట్ యార్డులో సిసిఐ కొనుగోలు కేంద్రాన్ని నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్ రావు ప్రారంభించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రతి అడుగులో రైతన్న సంక్షేమానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో రైతు సంక్షేమ పాలన సాగుతుందని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు పత్తిని విక్రయించుకోవాలని కోరారు. దళారులు నమ్మి మోసపోవద్దు అని పేర్కొన్నారు. నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మస్తాన్, నందిగామ ఎంపిపి సుందరమ్మ, ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

బహిరంగ సభ కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : నవంబర్ 15న చలో విజయవాడ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీని కార్యదర్శి బి రాజేష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోనే కాటూరు గ్రామంలోబహిరంగ సభ కరపత్రాలు పంపిణీ చేశారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలు నశించాలని అన్నారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ రైతాంగ సమస్యలు పరిష్కరించాలని రైతుల పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు సజ్జ బాల గంగాధర్ ఏ సుబ్బారావు కొడాలి ఏసు పాదం రైతులు కవులు రైతులు వ్యవసాయ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో...


మొవ్వలో...

ప్రజాశక్తి-మొవ్వ: రాష్ట్ర భవిష్యత్తును సక్రమమార్గంలో నడిపించేందుకు ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైనదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన మొవ్వలో నవంబరు 15వ తేదీన సిపిఎం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమంపై రూపొందించిన కరపత్రాన్ని పార్టీ, ప్రజా సంఘాల నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శీలం నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్ర పారిశ్రామి కాభివృద్ధికి మూలమైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మకానికి పెట్టడం, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు, కడపలో ఉక్కు కర్మాగారం నిర్మాణం, రైల్వే జోన్ ఏర్పాటు వంటి హామీలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తుందని విమర్శించారు. ప్రజల ఆకాంక్షలను చాటిచెప్పేందుకు సిపిఎంనవంబర్ 15న తల పెట్టిన చలో విజయవాడ ను విజయవంతం చేయాలని నారాయణరావు పిలుపు నిచ్చారు. సిఐటియు మండల కార్యదర్శి కాకి రాజశేఖర్, కొడాలి శ్రీనివా సరావు, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు లాజర్ పాల్గొన్నారు.



తాగునీరందించాలని వినతి

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండలం మందపాకల శివారు పాదాలవారిపాలెం గ్రామంనకు తాగునీరు అందించాలని కోడూరు మండల టిడిపి అధ్యక్షులు బండే శ్రీనివాసరావు కోరారు. సోమవారం కోడూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద స్పందన కార్యక్రమంలో ఎంపిడీవో శ్రీనివాస్ కు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాష్ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గత కొద్దికాలంగా పాదాలవారిపాలెం గ్రామస్తులు, పైప్ లైన్ పాడవుట కారణంగా తాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారని, వెంటనే పైప్లైన్ బాగు చేయించి గ్రామస్తులకు తాగునీరు అందించాలని, అద్వానంగా ఉన్న మంచినీటి చెరువుని బాగు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కే హనుమంతరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ మధ్యాహ్నం 12 గంటల నుండి మధ్యా హ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందువల్ల నియోజకవర్గ పరిధిలోని ప్రజలు తమ ప్రయాణ అవసరాలపై సూచ నలు సలహాలు 9959225466 నెంబర్ కు తెలియ జేయాలన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

అక్రమ మద్యం రవాణా అరికట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో అక్రమ మద్యం రవాణాపై దష్టి సారించాలని, నాటు సారా కేంద్రాలను అరికట్టాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు సోమవారం కలెక్టరేట్లో ఎక్సైజ్, ఎస్ఇబి అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ మద్యం రవాణా పై దష్టి సారించాలని, ముఖ్యంగా తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేక విజిలెన్స్, నిఘా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మద్యం దుకాణాల పనితీరుపై కలెక్టర్ సమీక్షిస్తూ ఎక్సైజ్ సీఐల వారీగా, డిపోల వారీగా, షాపుల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు డ్యూటీ పెయిడ్ లిక్కర్ (డి పి ఎల్) సంబం ధించి 231 కేసులు నమోదు చేసి 485 లీటర్లు సీజ్ చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ సూపర్నెంట్ సునీత, ఏఎస్పి శ్రీహరిబాబు, డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ ఇన్స్పెక్టర్ అశోక్, జిల్లాలో ఎక్సైజ్ సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రభుత్వం అందించే ఉచిత వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి. రాజాబాబు సూచించారు. చల్లపల్లి మండలం కేంద్రంలో నాబార్డ్ నిధులు 4 కోట్ల 60 లక్షల రూపాయల వ్యయంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆధునికరించి నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్ర భవన సముదా యాన్ని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ సోమవారం ప్రారంభించారు. చల్లపల్లి నడిబొడ్డున 2.80 ఎకరాల విస్తీర్ణంలో 12287.92 చదరపు అడుగుల పరిధిలో 30 పడకల ఆసుపత్రిలోని అడ్మినిస్ట్రేటివ్ విభాగం, ఓపి - డెంటల్, జనరల్, టీబీ, రక్త పరీక్ష చేసే ల్యాబ్, ప్రైమరీ పోటీ కాంప్లెక్స్, లేబర్ రూమ్, జనరల్ వార్డులు, ఫిజియోథెరపీ, ఐసిటిసి, కాజువాలిటీ, స్టోర్లు వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి గ్రామ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైసీపీ రైతు విభాగం జోనల్ ఇంచార్జి కడవకొల్లు నరసింహారావు, చల్లపల్లి జడ్పిటిసి రాజులపాటి కళ్యాణి, ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు పాల్గొన్నారు.


సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజాబాబు



ఘంటసాలలో జర్మనీ వాసుల పర్యటన

ప్రజాశక్తి ఘంటసాల : ప్రముఖ బౌద్ధ క్షేత్రంగా విరాజిల్లుతున్న ఘంటసాలలోని బౌద్ధ స్తూపం, మ్యూజియంను జర్మనీ కి చెందిన పర్యాటక బృందం యూత్ అచీవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం సందర్శించారు. అనంతరం ఘంటసాల లోని గోటకం కాలనీలో చేనేత కార్మికులు నేత నేసే విధానాన్ని రాష్ట్ర చేనేత కార్మిక సంఘం నాయకులు అందే జగదీష్ వివరించారు . వారితోపాటు ఆర్థిక సమతా మండలి పిడి సత్యనారాయణ, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకష్ణ, రశ్మి సమరం పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్తు : డిఎస్పి


సదస్సులో మాట్లాడుతున్న డిఎస్పి మురళీధర్

ప్రజాశక్తి-అవనిగడ్డ : విద్యార్థులు సత్ప్రవర్తనతో జీవితాలు సరిదిద్దుకోవాలని డిఎస్పి మురళీధర్ సూచించారు. సోమవారం అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ ఇంటర్ పదో తరగతి చదువుతున్న విద్యార్థుల వయసు ప్రమాదకర మైనదని, ఆ వయసులో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తు జీవితాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. దురదష్టవశాస్తు ఈనాడు విద్యార్థులను పెడదారులు పట్టించేందుకు అనేక దుష్టశక్తులు పనిచేస్తున్నాయని, వారిలో బలహీనతలను ఆసక్తిని ఆసరా చేసుకొని అనేక రుగ్మతల వైపు వారిని ప్రోత్సహి స్తున్నారన్నారు. అటువైపు ప్రయాణం చేయకుండా చదువు పట్ల ఆసక్తి పెంచుకోవడం తోపాటు ఉన్నత చదువులు అభ్యసించే విధంగా మంచి భవిష్యత్తు కోసం కలలుకనాలన్నారు. విద్యార్థులు స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. స్మార్ట్ ఫోన్లతో జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు సుబ్బారావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి దుర్గారమేష్, సిఐ రమేష్, ఎస్సై రమేష్, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైసిపితోనే సామాజిక న్యాయం : ఎంపి

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు సముచిత న్యాయం జరిగిందని జిల్లా పరిశీలకులు మర్రి రాజశేఖర్ తెలిపారు. నవంబర్ రెండవ తేదీన అవనిగడ్డలో జరగనున్న సామాజిక సాధికార యాత్ర విజయవంతం చేసేందుకు చేపట్టవలసిన చర్యలపై సమీక్షించేందుకు అవనిగడ్డకు విచ్చేసిన ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వాలు ఏవి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు అధికారంలో భాగస్వామ్యం అంతంతమాత్రంగానే కల్పించారని, కానీ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రివర్గంలో కానీ నామినేటెడ్ పదవుల విషయంలో కానీ ప్రజాప్రతినిధులుగా గాని జనరల్ స్థానాల్లో కూడా బీసీలకు అవకాశం కల్పించిన పరిస్థితి చూస్తే వారి పట్ల ముఖ్యమంత్రి చిత్తశుద్ధి ఏ పార్టీతో అర్థం చేసుకోవచ్చు అన్నా రు. ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా హామీలు అన్ని పూర్తి చేశారని అన్నా రు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, కృష్ణ గుంటూరు ఎన్టీఆర్ జిల్లాల రైతు విభాగం జోనల్ ఇంచార్జ్ కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సుమతి దేవి, సర్పంచ్ ఉమా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్ అయోధ్య రామిరెడ్డి

స్పందన ఫిర్యాదులు పరిష్కరించాలి : డిసిపి

ప్రజాశక్తి-విజయవాడ : ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికి ఆయా పోలీస్టేషన్ల ఎస్హెచ్ఒలు చర్యలు తీసుకోవాలని రూరల్ డిసిపి అజిత వేజెండ్ల ఆదేశించారు. నగర పోలీసు కమిషనర్ కార్యాలయం ప్రాంగణంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. డి.సి.పి. రూరల్ అజిత వేజెండ్ల స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి బాధితుల నుండి వివిధ సమస్యలు, వినతులు, స్వీకరించారు. విజ్ఞప్తులకు సంబంధించి నేరుగా బాధితు లతో మాట్లాడారు. దివ్యాంగులు, వద్దుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసు కున్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లకు సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అందిన ఫిర్యాదుల్లో నగదు లావాదేవీలకు సంబంధించినవి 28 ఫిర్యాదులు, భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు 14, సివిల్ వివాదాలకు సంబంధించినవి 15, వివిధ మోసాలకు సంబంధించినవి 10, ఇంటి అద్దె విషయం సంబంధించినవి 03, దొంగతనంకు సంబంధించినవి 02 , ఇతర చిన్న చిన్న వివాదాలు సమస్యలుకు, సంఘటనలకు సంబంధించినవి 17, మొత్తం 89 ఫిర్యాదులను డిసిపి స్వయంగా స్వీకరించారు.



మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-విజయవాడ : తెలంగాణ నుండి ఆంధ్రకు మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తి నుండి 150 మద్యం బాటిళ్లను సిబ్బందితో కలిసి సిఐ హనీష్ స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ నుండి నందిగామ మండలం జొన్నలగడ్డ చెక్పోస్టు నుండి మద్యం తీసుకొస్తున్న మువ్వ కిరణ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ హనీష్ ఈ సందర్భంగా తెలిపారు. మద్యం తరలించే వ్యక్తిని చాకచక్యంగా పట్టుకునేందుకు ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డుగా సిఐ హనీష్ నగదును అందజేశారు.

6 నుండి ఎంబివికెలో కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ : రోటరీక్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ వారి సహకారంతో నగరంలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణా కేంద్రంలో ఎంఎస్ ఆఫీస్ కొత్త బ్యాచ్‌ను నవంబరు 6వ తేదీ నుండి ప్రారంభించనున్నట్లు ఎంబివికె కంప్యూటర్ విభాగం బాధ్యులు టి.క్రాంతి ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలలు ప్రతి రోజూ రెండు గంటలపాటు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫీసు రూ.500 ఉంటుందని, రెండు నెలల కోర్స్ పూర్తి చేసుకుని పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి తిరిగి ఈ ఫీజు చెల్లిస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు నవంబరు 4వ తేదీలోపు తమ వివరాలను గవర్నరుపేట, ఆకులవారి వీధి, రాఘవయ్యపార్కు వద్ద గల ఎంబివికె ఆఫీసులోగానీ, 0866 2578044, 9490098042లకు ఫోన్ చేసిగానీ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని క్రాంతి పేర్కొన్నారు.

హెచ్‌ఐఎల్ ఆర్థిక సహకారం అభినందనీయం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ : జిల్లాలో వివిధ అభివద్ధి పనులకు కార్పోరేట్ సోషల్ రెస్పాన్స్ బుల్టీ లో భాగంగా సికె బిర్లా గ్రూపుకు చెందిన హైదరాబాద్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (హెచ్‌ఎఐఎల్) నిధులతో సహకారం అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు అన్నారు.కార్పోరేట్ సోషల్ రెస్పాన్స్ బుల్టీ (సిఎస్ఆర్) ఫండ్ లో భాగంగా 5 లక్షల ఆర్థిక సహాయ చెక్ ను సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆ సంస్థ ప్రతినిధులు కలెక్టర్ ఢిల్లీరావుకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో వివిధ మౌలిక వసతుల కల్పన, అభివద్ధి పనులకు ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లికి చెందిన సికె బిర్లా గ్రూపుకు చెందిన హైదరాబాద్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (హెచ్ఐఎల్) సంస్థ స్వచ్ఛందంగా 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. గతంలో కూడ హైదరాబాద్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (హెచ్ఐఎల్) సంస్థ 7 లక్షల 10 వేల రూపాయల నిధులను ఎస్‌సి, ఎస్‌టిగి, బిసి సంక్షేమ వసతి గహాలకు అవసరమైన రక్షణ గ్రిల్స్, రూఫింగ్ తదితర సౌకర్యాలు కల్పించేందుకు అందించినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఐఎల్ లిమిటెడ్ యూనిట్ హెడ్ ఎన్ లక్ష్మికాంత్, మేనేజర్ (హెచ్ ఆర్) వైఎస్. సుబ్బారావు, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఎ. సుధాకర్ పాల్గొన్నారు.



సాగునీటి పర్యవేక్షణకు పోలీసు గస్తీ

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నామన్నారు. సాగునీరు అందుతున్న ప్రాంతాల్లో కూడా ఇక ముందుకు రాదేమో అనే భయంతో మళ్లీ మళ్లీ పొలాలకు నీరు పెట్టుకుంటున్నారని, దీనివల్ల శివారు ప్రాంతాలకు నీరు వెళ్లడంలేదని అన్నారు. మీడియాలో వ్యతిరేక వార్తలు రావడంతో రైతుల్లో అపోహలు ఏర్పడ్డాయన్నారు. ఈ అపోహలను తొలగించేందుకు జలవనరుల శాఖ అధికారులు, సిబ్బంది నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు వాస్తవాలు వివరించాలన్నారు. ఇలా రెండు వారాలపాటు ప్రతిరోజూ సాగునీటి సరఫరాను పర్యవేక్షించాలని ఆదేశించారు. కాల్వల్లో వాటర్ లెవెల్స్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా సాగునీటి సరఫరా విషయంలో పుకార్లు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. ఇరిగేషన్, పోలీస్, రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. గత ఏడాది ధాన్యం సేకరణలో ఎదురైన సమస్యలు పునరావతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం రవాణా వాహనాలకు జిపిఎస్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కమిటీ చైర్మన్ రాఘవరావు మాట్లాడుతూ శివారు ప్రాంతాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, ఈ ఏడాది ఖరీఫ్లో ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో రైతుల సాగునీటి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్.పద్మావతి గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై చర్యా నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్, జల వనరుల శాఖ ఎస్ఇ ప్రసాద్, కమిటీ సభ్యులు శ్రీకాకుళపు నాగేశ్వరరావు, పట్టపు శ్రీనివాసరావు, పెరుమాళ్ళు, ప్రభాకర్ రావు, వ్యవసాయ అనుబంధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వేగంగా అంబేద్కర్ స్మృతివనం పనులు

రాష్ట్ర ఎస్‌సి కమిషన్ సభ్యులు ఆనంద్ ప్రకాష్



ప్రజాశక్తి-విజయవాడ : భవిష్యత్ తరాలు స్మరించుకునే విధంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మతి వనం నిర్మాణం ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లం ఆనంద్ ప్రకాష్ అన్నారు.స్థానిక స్వరాజ్ మైదాన్ లో నిర్మాణం జరుపుకుంటున్న అంబేద్కర్ స్మతి వనం పనులను సోమవారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లం ఆనంద ప్రకాష్ పరిశీలించారు.



సమస్యలను పరిష్కరించాలి : దినకర్

ప్రజాశక్తి-విజయవాడ : సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. ఆయా విభాగాల ఉన్నతాధికారులతో కలిసి నగర కమిషనర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. వివిధ సమస్యలపై వచ్చిన 25 ఫిర్యాదులను కమిషనర్ సంబంధిత విభాగం అధికారులకు తెలియజేసి సూచించిన గడువులోపు నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ఎం ప్రభాకరరావు, సిఎంఒహెచ్ డాక్టర్ పి రత్నావళి, డిసిఆర్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ : స్పందన కార్యక్రమం ద్వారా అర్జీదారుడు ఆశించిన స్థాయిలో సమస్య పరిష్కరించేలా అధికారులు కషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని కలెక్టరేట్లోని పింగళి వెంకయ్య సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డా. పి. సంపత్ కుమార్, డిఆర్వో ఎస్ వి. నాగేశ్వరరావు ఆర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందన ఒక ప్రత్యేక వేదిక అని స్పందనలో సమర్పించే ఆర్జీలకు నిర్దేశించిన గడువులోగా అధికారులు పరిష్కారం చూపాలన్నారు. స్పందనలో వచ్చిన ఆర్జీలు 120గా నమోదయ్యాయి. వీటిలో రెవెన్యూ 53, పోలీస్ 15, యంఎయుడి 8, విద్య 4, విభిన్నప్రతిభావంతులు 4, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ 3, సర్వే అండ్ సెటిల్మెంట్ 4, కార్మిక శాఖ 1, హెల్త్ 7, మార్కెటింగ్ 1, డీఆర్డీఏ 3, దేవాదాయ శాఖ 1, గ్రామ, వార్డ్ సచివాలయాలు 1, పౌరసరఫరాలు 2, అటవీ శాఖ 1, కో ఆపరేటివ్ 3, సోషల్ వెల్ఫేర్ 2, హౌసింగ్ 2, ఐసిడిఎస్ 1, ఏపిసిపిడిసిఎల్ 2, స్కిల్ డెవలప్మెంట్ 1, ఉపాధికల్పన 1 ఆర్జీలు నమోదు అయ్యాయన్నారు. జిల్లాలోని డివిజన్ అధికారులు, ఆయా మండల యంపిడివోలు, తహాశీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లతో పరిష్కారమయ్యే వినతులు వర్చువల్ గా కలెక్టర్ డిల్లీరావు పరిష్కరించారు.స్పందన కార్యక్రమంలో డిఆర్డీఏ పీడి కె.శ్రీనివాస్, డీఈవో సీవి. రేణుక, పంచాయితీరాజ్ ఎస్ఈ. ఎ. వెంకటేశ్వరరావు, ఐసిడిఎస్ పీడి జి. ఉమాదేవి, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ యం. విజయభారతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి యం. రుక్మాంగదయ్య, హౌసింగ్ పిడి రజినీ కుమారి, డిజెబుల్డ్ ఎడి. వి. కామరాజు, పశుసంర్ధక శాఖ జెడి కె. విద్యాసాగర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలాజీ కుమార్, ఆర్అండ్ బి ఎస్ఇ వి.కె. విజయశ్రీ, ఎల్ డియం కె. ప్రియాంక, డ్వామా పిడి జె. సునీత, గ్రామ వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి కె. అనురాధ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వికలాంగులకు ప్రభుత్వం అండ : ఢిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ : వికలాంగులకు ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఆత్మస్థైర్యం విశ్వాసంతో ముందుకు వెళ్లి అనుకున్న లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. విభిన్నప్రతిభావంతుల వయోవద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ లో జిల్లాకు చెందిన విభిన్నప్రతిభావంతులకు మూడు చక్రాల స్కూటర్, సైకిల్ , వినికిడి యంత్రాలను జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పంపిణీ చేసారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి విభిన్నప్రతిభావంతుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. విభిన్నప్రతిభావంతులకు అవసరమైన ఉపకరణాలను పంపిణి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉపకరణాలకు జిల్లా వ్యాప్తంగా 200కు పైగా ధరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. వీటిలో అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేసి ఉచితంగా ఉపకరణాలు పంపిణి చేస్తున్నామన్నారు. 18 నుండి 45 సంవత్సరాల వయస్సు కలిగి 70 శాతం అంగవైకల్యం ఉన్నవారిని అర్హులగా గుర్తించడం జరుగుతుందన్నారు. ట్రై స్కూటర్లకు రిజిస్ట్రేషన్ ను ఉచితంగా నిర్వహించి 1లక్ష 20 వేల రూపాయల విలువగల స్కూటర్‌లను అందజేస్తున్నామన్నారు. వికలాంగులకు కత్రిమ అవయవాలు వినికిడి యంత్రాలు బదిరి మూగ విద్యార్థులకు లాప్టాప్లు, టచ్ఫోన్ లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఉపకారణాలు పంపిణీతో పాటు బ్యాంకుల నుండి రుణాలు అందిస్తున్నామని శారీరక వైకల్యం అనేది మెరుగైన జీవనానికి అడ్డంకి కాకుడదని వారికి మరింత తోడ్పాటు అందిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగి సకలాంగులకు ధీటుగా అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. లక్షా 20 వేల రూపాయల విలువగల ఒక మూడు చక్రాల స్కూటర్ ను ఒక్కొక్కటి 3,500 రూపాయలు విలువగల 4 వినికిడి యంత్రాలు 5500 రూపాయల విలువగల ఒక మూడు చక్రాల సైకిల్, 7,000 రూపాయల విలువగల ఒక విల్ చైర్ ను జిల్లా కలెక్టర్ పంపిణి చేసారు. కార్యక్రమంలో డిఆర్వో ఎస్ వి. నాగేశ్వరరావు, విభిన్నప్రతిభావంతుల వయోవద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి. కామరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





ప్రజారక్షణ భేరి సభను విజయవంతం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-విజయవాడ : అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ప్రత్యమ్నాయ విధానాలను వివరించేందుకు నవంబరు 15న సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహించే ప్రజారక్షణ భేరి బహిరంగ సభలో ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి కృష్ణ పిలుపునిచ్చారు. కృష్ణలంక 22వ డివిజన్ సిపిఎం ఆధ్వర్యంలో కాయల లక్ష్మణ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ తూర్పు నగర కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు బత్తుల చిన్నారావు, నగర కమిటీ సభ్యులు విజ్జి గురుమూర్తి, నాయకులు తాత సాంబయ్య, వాజశ్రీనివాసరావు, తాండవ కష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలికల విద్యాభివృద్ధికి కృషిచేయాలి



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని ఆంధ్రా లయోలా కాలేజీ 'ఎస్-జె ఎక్స్ లెన్స్ హాల్'లో సోమవారం కేజీబీవీల్లో కొత్తగా నియామకం పొంది విధుల్లో చేరిన సీఆర్టీలు, పీజీటీలు, పీఈటీలకు శిక్షణ ఇచ్చేందుకు 108 మంది స్టేట్ రిసోర్సు పర్సన్లకు 4 రోజులపాటు శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కేజీబీవీ సెక్రటరీ డి.మధుసూదనరావు మాట్లాడుతూ.. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీల్లో) చదువుతున్న బాలికలకు నాణ్యమైన విద్య అందించి, బాలికాభివద్ధికి కషి చేయాలన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిక్షణా కార్యక్రమానికి 'ఇగ్నస్ ఫెహల్' బందం భాగస్వామ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇగ్నాస్ ఫెహల్' ఎడ్యుకేషన్ సంస్థ వ్యవస్థాపకులు సుబీర్, కేజీబీవీ జాయింట్ సెక్రటరీ ఎన్.గీత పాల్గొన్నారు.

జర్నలిస్ట్ శ్రీనివాస్ మృతి

ప్రజాశక్తి - విజయవాడ : ఎపి7 24/7 విలేకరి పి.శ్రీనివాస్ కుమార్ (45) ఆదివారం రాత్రి గుండె పోటుతో మరణించారు. ఆయన కష్ణలంక 21 వ డివిజన్లలోని గుండు కోటయ్య వీధిలో నివాసం ఉంటున్నారు. ఆయనకు ఇద్దరు సోదరులు, తల్లి ఉన్నారు. ఆయన గతంలో వివిధ పత్రికల్లో పనిచేశారు.



స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్‌కు ఆర్ట్ గెలాక్సీ అవార్డు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరానికి చెందిన స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ వారు గత 19 సంవత్సరాలు గా చేస్తున్న చిత్ర కళా సేవకు ఈనెల 29న ఒంగోలు ఆర్ట్ ఫెస్టివల్‌లో ఆర్ట్ గెలాక్సీ అవార్డు అందుకున్నట్లు స్ఫూర్తి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. చిత్రకళకు పునరుజ్జీవనం అనే క్యాప్షన్ తో విజయవాడ నగరం, చుట్టు పక్కల ప్రాంతాల్లో కళనీ, కళా సంస్కతిని పెంపొందించాలనే ముఖ్య ఉద్దేశంతో 2005 ఏప్రిల్ 15 న స్థాపించి గత 19 సంవత్సరాలు గా వేల సంఖ్యలో చిన్నారులకు చిత్రలేఖనంలో తర్ఫీదు నిచ్చి వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న సజనాత్మక శక్తిని వెలికి తీసి ఏకాగ్రత, పరిశీలనాశక్తి, ఓర్పు, నేర్పు వంటి అధ్భుత లక్షణాలు వారికి వంటబట్టేలా చూస్తూ.. అంతర్జాతీయ స్థాయి కళాకారులను సమాజానికి అందించటమే కాకుండా...ఎందరికో ఉపాధి అవకాశాలను కల్పించి చిత్రకళాభివదికి "ఆర్ట్ బీట్", "టాలెంట్ హంట్" వంటి కార్యక్రమాలకు అంకురార్పణ చేసినట్లు తెలిపారు. ఈ అవార్డు మునుముందు మరిన్ని ఆర్ట్ ఈవెంట్స్ నిర్వహించేందుకు మంచి ఎనర్జీ టానిక్ లా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు.



సప్తగిరి గ్రామీణ బ్యాంక్-నున్న శాఖ

అడ్రసు: చెరువు సెంటర్, నున్న, విజయవా రూరల్ మండలం, ఫోన్: 0866-2854533.

బంగారు నగల వేలం ప్రకటన

ఈ దిగువ ఉదహరించిన వ్యక్తులు మా బ్యాంకు బ్రాంచిలో బంగారు నగలు తాకట్టు పెట్టి అప్పు తీసుకొని సదరు అప్పు సకాలంలో చెల్లించమని నోటీసులు పంపిననూ బాకీ చెల్లించనందున బాకీ గడువు మీరినందు వలన మాకు కుదువపెట్టిన ఆభరణములను ది.03-11-2023 శుక్రవారం మధ్యాహ్నం 3-00 గం॥లకు వేలము వేయుటకు నిర్ణయించటమైనది. వేలంపాటలో పాల్గొనదలచిన వారు 10,000/- ధరావత్తు సొమ్ము చెల్లించి వేలముపాటలో పాల్గొనవచ్చును. ఐ.డి. ప్రూఫ్‌లు కలిగి వుండవలెను. వేలము తేది మార్చుటకు గానీ, నిలుపుటకు గానీ, రద్దు పరచుటకుగాని బ్రాంచి మేనేజర్‌కు సర్వాధికారములు కలవు. వేలం తరువాత ఇంకనూ బాకీ తీరని యెడల వారిపై కోర్టు ద్వారా చర్య తీసుకొనబడును.

వ. నెం.	అప్పు నెం.	పేరు	తండ్రి / భర్త పేరు	గ్రామము	మొత్తం బరువు గ్రా॥లలో
1	50047811491	పోటూరి శివయ్య	గోపాలం	నున్న	31
2	50044705962	పోటూరి శివయ్య	గోపాలం	నున్న	41
3	50045249248	పోటూరి శివయ్య	గోపాలం	నున్న	43

నోటీసులు అందని యెడల దీనినే ఆఖరి నోటీసుగా పరిగణించవలసినదిగా కోరుతున్నాము.

తేది: 30-10-2023
నున్న, విజయవాడ రూరల్ మండలం

సం/- బ్రాంచి మేనేజర్
ఫోన్: 9281088181 / 0866-2854533



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పే ఔత్సాహికులకు అన్ని విధాల ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో జిల్లా పరిశ్రమలు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సకాలంలో అన్ని రకాల అనుమతులు మంజూరు చేసి విరివిగా పరిశ్రమలు నెలకొల్పేందుకు పూర్తి సహకారం అందించాలన్నారు. ఏ పరిశ్రమల్లో ఏ రకమైన నైపుణ్య అభివద్ధి అవసరమో అందుకు సంబంధించిన నివేదిక వచ్చే సమావేశానికి తీసుకుని రావాలన్నారు. పరిశ్రమల ఎస్టేట్లో యూనిట్లు నెలకొల్పేందుకు 1942 మందికి స్థలాలు కేటాయించారని అందులో ఎంతమంది యూనిట్లు నెలకొల్పారని, ఇంకా ఎన్ని నిర్మాణ దశలో ఉన్నాయి, ఇంకా ఎన్ని ఖాళీగా భూములు ఉంచుకున్నారని వాటి వివరాలు వచ్చే సమావేశానికి తీసుకుని రావాలన్నారు. యూనిట్లు నెలకొల్పేందుకు స్థలం కేటాయించినప్పటికీ ఎటువంటి యూనిట్లు ఇప్పటివరకు పెట్టుకోని సంబంధిత పారిశ్రామిక వేత్తలకు నోటీసులు జారీ చేయాలని, వారి సమాధానాలు, ఎన్ని స్వాధీన పరుచుకోవాలి అనే అంశాలపై వచ్చే సమావేశానికి నివేదిక తీసుకొని రావాలని స్పష్టం చేశారు. స్థలాలు తీసుకొని వినియోగించుకోకుంటే వాటిని రద్దు పరచి కొత్త పారిశ్రామికవేత్తలకు కేటాయించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. యూనిట్లు నెలకొల్పడంలో ఆలస్యం అయ్యే వాటికి సమయం పొడిగింపు కోసం వచ్చిన దరఖాస్తులను చాలా క్షుణ్ణంగా పరిశీలిస్తామని సంబంధిత ప్రభుత్వ వాటాదారులకు ముందుగా పంపించి సరైన విధంగా విచారించి నివేదిక వచ్చే సమావేశానికి అందజేయాలన్నారు. ఈ సమావేశంలో డిఐసి జీఎం వెంకట్రావు, ఏపీఐఐసీ జడ్ ఎం కేఎస్ సీతారాం, డిఆర్డిఏ పిడి పిఎస్ఆర్ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, జిల్లా విద్యుత్ అధికారి భాస్కరరావు,పాల్గొన్నారు.

డోలాస్ ఐటిఐ కళాశాలలో స్వచ్ఛభారత్



మొక్కలు నాటుతున్న దృశ్యం

ప్రజాశక్తి - నందిగామ : మునగచర్ల గ్రామ సమీపంలోని డోలాస్ ఐటిఐ కాలేజీలో సోమవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పగిడిపల్లి దేవసహాయం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ పగిడిపల్లి దేవసహయం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మ్నొక్కలు నాటి పర్యావరణం మెరుగు పరచాలని సూచించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డోలాస్ ఐటిఐ కాలేజి ప్రిన్సిపాల్ అనిల్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుంటూ పరిసరాలు శుభ్రం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్టిసి డ్రైవర్‌కు పరామర్శ

ప్రజాశక్తి - భవానీపురం : ఎపిఎస్ఆర్టిసి విద్యాధరపురం సెంట్రల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కావలిలో అల్లరిమూకల దాడులకు గురైన ఆర్టీసీ డ్రైవర్ బి.రామ్‌సింగ్‌ని ఎపి పిటిడి బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్పి శేషగిరిరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.వెంకటపతి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. సభ్యులు ఎం.రామ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఊరేగింపును విజయవంతం చేయండి

ప్రజాశక్తి - గుడివాడ : గుణదల మాత 100 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 31వ తేదిన కార్మెల్ మాత దేవాలయం నుండి గుణదల మాత తేరును పట్టణంలో ఊరేగింపును విజయవంతం చేయాలని మౌంట్ కార్మెల్ మాత దేవాలయం ఫాదర్ గుజ్జుల మైఖేల్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఏలూరు రోడ్డులోని మౌంట్ కార్మెల్ మాత (ఆర్.సి.ఎం) దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయంత్రం 4గంటల నుండి ఏలూరురోడ్డు నుండి నెహ్రూచౌక్ వరకు మరియమాత స్వరూపాన్ని ఊరేగిస్తామని తెలిపారు.

చెరకు సాగులో అధునాతన పద్ధతులపై అవగాహన



ప్రజాశక్తి-ఉయ్యూరు : పెరిగిన ఖర్చులు, కూలీల సమస్య, తగ్గిన దిగుబడులతో చెరకు సాగు గిట్టుబాటు కాక రైతులు చెరకు సాగుకు విముఖత చూపుతున్న పరిస్థితుల్లో యాంత్రీకరణ, అధునాతన పద్ధతులు తప్పనిసరని జాతీయ చెరకు పరిశోధనా కేంద్రం లక్నో డైరెక్టర్ ఆర్. విశ్వనాథన్ అన్నారు. అడుసుమిల్లి గోపాలకష్ణయ్య స్మత్యర్థం చెరకు సాగు లాభదాయకం, మెళకువలు అనే అంశముపై స్థానిక రామకష్ణ రిక్రియేష న్ క్లబ్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన చెరకు రైతులకు అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. చెరకుపంటలో అధిక దిగుబడి నిచ్చే వంగడాలు, చె రకు సాగులో యాంత్రీకరణ చేపట్టివలసిన అవసరం, డ్రోన్ల ద్వారా పురుగు మందుల పిచికారీ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. కేసీపీ షుగర్స్ ఉయ్యూరు యూనిట్ హెడ్ వై. సీతారామదాస్ సదస్సును ప్రారంభించి మాట్లాడుతూ చెరకుసాగు లో ప్రస్తుత పరిస్థితులు, గిట్టుబాటుకు చేపట్టవలసిన అధునాతన పద్ధతులు వివరించారు. అధిక దిగుబడి, రసనాణ్యత నిచ్చే నూతన చెరకు వంగడాలు తయారు చేయాలని శాస్త్రవే త్తలకు సూచించారు. డైరెక్టర్ ఆఫ్ షుగర్ అండ్ కేన్ కమిషనర్ వి. వెంక ట్రావు, ఏడీఆర్ పీవీకే జగన్నాధరావు, ఆదిలక్ష్మి, ఏవీ రమణ తదితర శాస్త్రవేత్తలు పాల్గొని పలు సూచనలు చేశారు. డిప్యూటీ కమిషనర్ కేసన్ జి.ముత్యాలు, కేసీపీ కేన్ జీఎం పున్నారావు, డీజీఎం ఆర్. సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

బోర్‌వెల్ నిర్మాణ పనులు ప్రారంభం



బోర్ వెల్ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఉంగుటూరు(గన్నవరం) ఉంగుటూరు మండలంలోని వెన్నూతల గ్రామంలో తాగునీరు అవసరాల దష్ట్యా మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు ద్వారా అంచనా రూ.7 లక్షలు విలువతో మంజూరైన బోర్‌వెల్ నిర్మాణం పనులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ జి.ఎస్.వి శేషగిరిరావు మాట్లాడుతూ త్వరితగతిన వెంటనే పనులు పూర్తి చేయాలని గుత్తేదారునికి సూచించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ , గ్రామస్తులు ఎంఎల్‌ఏ వంశీకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ టి.వెంకట రామ మోహనరావు, వార్డు సభ్యులు నాగలక్ష్మి , గ్రామ పెద్దలు నర్ని వెంకటేశ్వరరావు పాల్గొనారు.

పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - గుడివాడ : దేవుని సేవలో గత 45సం॥ల నుండి ఎంతో మందిని దేవుని మార్గంలో నడిపిస్తున్న దైవ సేవకులు ఎరికిపాటి దైవకృపాదానం 75వ పుట్టినరోజు జరుపుకోవడం అభినందనీయమని పాస్టర్ ఫ్రెయిర్ ఫెలోషిప్ రాష్ట్ర అధ్యక్షులు జి.శ్యామ్‌బాబు అన్నారు. సోమవారం స్థానిక టీచర్స్ కాలనీలోని హోసన్నా చర్చిలో పాస్టర్ ఇడి కృపాదానం 75వ పుట్టినరోజు సందర్భంగా చర్చి సభ్యులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఏరికిపాటి రత్నాకర్, స్టాన్లీ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ వ్యాపారం అరికట్టాలని వినతి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని 23 గ్రామపంచాయతీల్లో అక్రమ మద్యం వ్యాపారంపై నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు వీరంకి వీరాస్వామిన్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో దాదాపుగా అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నాయనీ, సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడిందనీ సంబంధిత అధికారులు కూడా లంచాలకు బానిసలై గ్రామాల్లో మద్యం విక్రయిస్తున్న వారిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు.

కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి-గన్నవరం : మండలంలో మానికొండ గ్రామంలో అధ్యక్షులు ఆరుమళ్ల కష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆళ్ల హనుక్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. మనికొండ గ్రామ అధ్యక్షులు యాడ్లపల్లి సాయి, మహిళా అధ్యక్షు రాలు మండవ రమ్య, వైస్ ప్రెసిడెంట్ బెజవాడ నాగేశ్వరావు పాల్గొన్నారు.

సామాజిక యాత్ర పేరు మార్చాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా తలపెట్టిన సామాజిక సాధికారత యాత్ర పేరు మార్చాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గోవా గోవర్ధన్ అన్నారు.. సోమవారం ప్రెస్ క్లబ్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ సామాజిక న్యాయం అంటే వివరణ జాతులను ఐక్యపరచడం, అభివద్ధి చేయడం, గొప్ప సంస్కరణలు తేవడానికి సామాజిక న్యాయం అంటారని తెలిపారు. అటువంటిదేమీ జరగలేదని బీసీలకు వేరువేరుగా 56 కార్పొరేషన్ ఇచ్చి వారి ఐక్యతను విడదీయడం సామాజిక న్యాయమా అని ప్రశ్నించారు. అదే విధంగా ఎస్సీలకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలు రద్దుచేసి కోట్లాది మందిని మోసం చేశారన్నారు.

'నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

ప్రజాశక్తి-పెదపారుపూడి: సాగు నీరు లేక పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారావు కోరారు. సోమవారం మోపర్రు గ్రామంలో వరి పొలాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట చేతికి అందుతున్న దశలో సాగునీరు రాకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. వరి పైరు ఎండిపోవడంతో రైతులు పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. గత 15 రోజులుగా ప్రధాన కాలువలకు సాగునీరు పూర్తిస్థాయిలో లేకపోవడంతో వరి పొలాలు ఎండిపోయే దశకు చేరుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నీలం మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదం దురదృష్టకరం

ప్రజాశక్తి-ఉయ్యూరు : విజయనగరం జిల్లాలో ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాద ఘటన దురదష్టకర సంఘటన అని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ వింగ్ నేషనల్ వైస్ చైర్మన్ జమీల్ అహ్మద్‌బేగ్ అన్నారు. ఈ సందర్భంగా ప్రమాద ఘటనలో మతుల కుటుంబాలకు ప్రభుత్వం, రైల్వే శాఖ తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ప్రమాద ఘటనపై విచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలని, భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదంలో మతి చెందిన కుటుంబాలకు నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ తరపున అండగా ఉంటామని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ వింగ్ నేషనల్ వైస్ చైర్మన్ జమీల్ అహ్మద్‌బేగ్ తెలిపారు.



ఇంకుడు గుంత నిర్మాణం

ప్రజాశక్తి-పెదపారుపూడి : భూగర్భ జలాలు పెంపొందించుకోవాలని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు .సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యా లయం వద్ద ఇంకుడు గుంటను ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటి వద్ద ఇంకెడు గుంటను ఏర్పాటు చేయాలని, దీనివల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టీ సీతా మహాలక్ష్మి, ఏపీవో నత్త స్ఫూర్తి ,విజయ రాజు ,తదితరులు పాల్గొన్నారు .

దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయానికి హైకోర్టు న్యాయమూర్తి నరేంద్ర సోమవారం విచ్చేశారు. రాష్ట్ర హైకోర్టు న్యాయ మూర్తి జి.నరేంద్రకు ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి ఆలయ వేద పండితులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదములు, శేషవస్త్రము, చిత్రపటం అందజేశారు.



అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

సత్తా చాటిన శ్రీనిధి విద్యార్థులు

ప్రజాశక్తి-తిరువూరు: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తమ విద్యార్థిని అత్యంత ప్రతిభ కనబర్చినట్లు తిరువూరు శ్రీనిధి పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.వెంకటనారాయణ తెలిపారు. జపాన్ షిటోరియు కరాటే స్కూల్ అధ్వర్యంలో మంగళగిరిలో నిర్వహించిన 8వ జాతీయస్థాయి కరాటే పోటీలలో పా ఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థిని ఎం.వరలక్ష్మి సబ్ జూనియర్స్ కటా విభాగంలో తలపడి ప్రథమస్తా నంలో నిలిచిందన్నారు. సందర్భంగా సోమవారం పాఠశాలలో వరలక్ష్మి ప్రిన్సిపల్ తో పాటు కరస్పాండెంట్ ఎం. కిషోర్ బాబు, హైస్కూల్ ఇన్ ఛార్జ్ వై.శ్రీనివాసరావు, జి.పద్మావతి, కరాటే కోచ్ ఎం.రేవంత్, ఉపాధ్యాయులు అభినందించారు.



కరాటేలో నారాయణ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మైలవరం: జాతీయ కరాటే ఛాంపియన్ షిప్‌లో మైలవరం నారాయణ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ రత్నకుమారి సోమవారం తెలిపారు. ఈనెల 29వ తేదీన గుంటూరు జిల్లా మంగళగిరిలో జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు జరిగాయని ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఎస్ జస్వంత్ కు ప్రథమ స్థానం, జి మణికంఠలు ద్వితీయ స్థానం సాధించారన్నారు. వీరు ఇరువురిని పాఠశాల ఏజీఎం హరీష్ బసవరాజ్, ఆర్ ఐ గురు ప్రసాద్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు కెవిఆర్ విద్యార్థులు

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : ఉమ్మడి కష్ణాజిల్లా పాఠశాలలు స్థాయి ఆధ్వర్యంలో మచిలీపట్నంలో నిర్వహించిన బాల్ బ్యాట్మెంటన్ సెలక్షన్స్ లో స్థానిక కెవిఆర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ కనబర్చిన పాఠశాల విద్యార్థులు గజ్జి గౌతమ్ బొడ్డు అఖిల్ ను సోమవారం ప్రధానోపాధ్యాయిని కె.జలజ, వ్యాయామ ఉపాధ్యాయులు వి వెంకటరమణ, జి.బాబుప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించాలని వారు ఆకాంక్షించారు.



'బాలికల విద్యాభివృద్ధికి కృషి చేయాలి'


ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: నగరంలోని ఆంధ్రా లయోలా కాలేజీ 'ఎస్-జె ఎక్స్ లెన్స్ హాల్'లో సోమవారం కేజీబీవీల్లో కొత్తగా నియామకం పొంది విధుల్లో చేరిన సీఆర్టీలు, పీజీటీలు, పీఈటీలకు శిక్షణ ఇచ్చేందుకు 108 మంది స్టేట్ రిసోర్సు పర్సన్లకు నాలుగు రోజుల పాటు శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కేజీబీవీ సెక్రటరీ డి.మధుసూదనరావు మాట్లాడుతూ కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీల్లో) చదువుతున్న బాలికలకు నాణ్యమైన విద్య అందించి, బాలికాభివద్ధికి కృషి చేయాలని అన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిక్షణా కార్యక్రమానికి 'ఇగ్నస్ ఫెహల్' బందం భాగస్వామ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇగ్నాస్ ఫెహల్' ఎడ్యుకేషన్ సంస్థ వ్యవస్థాపకులు సుబీర్, కేజీబీవీ జాయింట్ సెక్రటరీ ఎన్.గీత, ఎస్సీఈఆర్టీ, సమగ్రశిక్ష సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాల్లోని కేజీబీవీల టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నారు.



టేబుల్ టెన్నిస్‌లో 'శారద' విద్యార్థి విజయం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

మొగల్‌రాజపురంలోని శారద విద్యా సంస్థలలో జూనియర్ ఇంటర్ ఎంపిసి చదువుతున్న పి.వి.పవన్‌సత్య రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల టేబుల్ టెన్నిస్ పోటీలలో ప్రథమ స్థానం సాధించాడని శారద విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వై.రమేష్‌బాబు, మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి తెలిపారు. మొగల్‌రాజపురంలోని కళాశాల కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం ప్రతిభ కనపరచిన విద్యార్థికి అభినందన సభ జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబరు 13 నుండి 16వ తేదీ వరకు అనంతపూర్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపూర్ ఆర్‌డిటి జుడో ఇంటర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో తమ విద్యార్థి పవన్ సత్య ప్రతిభ కనపరచి ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. పి.వి. పవన్ సత్య ఇటీవల జరిగిన జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో కూడా టేబుల్ టెన్నిస్‌లో ప్రతిభ కనపరచి పతకాలు సాధిస్తున్నాడని అన్నారు. చదవుతోపాటు తమ కళాశాల క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఇందులో భాగంగానే తమ విద్యార్థులు పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో కూడా పాల్గొని ప్రతిభ కనపరుస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో జరిగే



పోటీలలో కూడా పవన్ సత్య మరిన్ని పతకాలు సాధించి కళాశాల, రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో శారద విద్యా సంస్థల జనరల్ మేనేజర్ జి.వి.రావు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్‌కు అవార్డు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: నగరానికి చెందిన స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ గత 19 సంవత్సరాలు గా చేస్తున్న చిత్ర కళా సేవకి ఒంగోలు ఆర్ట్ ఫెస్టివల్‌లో ఆదివారం ఆర్ట్ గెలాక్సీ అవార్డు అందుకున్నట్లు స్ఫూర్తి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. చిత్రకళకి పునరుజ్జీవనం అనే క్యాప్షన్‌తో విజయవాడ నగరం మరియు చుట్టు పక్కల ప్రాంతాల్లో కళనీ, కళా సంస్కృతిని పెంపొందించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో 2005 ఏప్రిల్ 15 న స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ స్థాపించి నట్లు తెలిపారు 19 సంవత్సరాలుగా వేల సంఖ్యలో చిన్నారులకు చిత్రలేఖనంలో తర్ఫీదు ఇస్తున్నామని అన్నారు. వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న సజనాత్మక శక్తిని వెలికి తీసి ఏకాగ్రత, పరిశీలనాశక్తి, ఓర్పు, నేర్పు వంటి అధ్భుత లక్షణాలు వారికి వంటబట్టేలా చూస్తూన్నమని అన్నారు. అంతర్జాతీయ స్థాయి కళాకారులను సమాజానికి అందించటమే కాకుండా ఎందరికో ఉపాధి అవకాశాలను కల్పించి చిత్రకళాభివదికి "ఆర్ట్ బీట్", "టాలెంట్ హంట్" వంటి కార్యక్రమాలకు నిర్వహిస్తున్నామని తెలిపారు. సామాజిక అంశాలను కూడా చిత్రకళకి జతచేసి "సేవ్ స్పారో", "సేవ్ నేచర్ ఫర్ ఫ్యూచర్", "సలాం ఇండియా" వంటి ఆర్ట్ ఈవెంట్స్ వందల



సంఖ్యలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రోత్సాహం కోసం సీనియర్ కళాకారులకు లిచిత్ర కళా రత్నలి యువ చిత్రకారులకు లియువ చిత్ర రత్నలి చిన్నారులకు లిబెస్ట్ బడ్డింగ్ ఆర్టిస్ట్‌లి అవార్డు లను అందిస్తూ విప్లవాత్మక, ప్రయోగాత్మక, సజనాత్మక ఆలోచనతో చిత్రకళకు చక్కటి వన్నె తెచ్చిన లిస్ఫూర్తిలి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ ప్రస్థానానికి లిఆర్ట్ గెలాక్సీ అవార్డులి దక్కటం గర్వంగా ఉందన్నారు. ఈ అవార్డు మునుముందు మరిన్ని ఆర్ట్ ఈవెంట్స్ నిర్వహించేందుకు మంచి ఎనర్జీ టానిక్‌లా పనిచేస్తుందన్నారు.

ముగిసిన బాస్కెట్ బాల్ పోటీలు

ప్రజాశక్తి-మైలవరం: గత రెండు రోజులుగా స్థానిక లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న జేఎన్టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ బాస్కెట్ బాల్ పోటీలు ముగిసాయి. ఈ పోటీలలో జేఎన్టీయూ కాకినాడ పరిధిలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. పురుషుల విభాగంలో 13 జట్లు, మహిళల విభాగంలో 5 జట్లు ఈ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన చేశారు. పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేఎన్టీయూ కాకినాడ సెక్రటరీ జి. పి. రాజు, లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే. అప్పారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎన్. వి.రాజ్ కుమార్ హాజరయ్యారు.ఈ పోటీలలో కాకినాడ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు ప్రథమ స్థానం, విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ భీమవరం ద్వితీయ స్థానాన్ని, స్థానిక లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల జట్టు తతీయ స్థానంలో నిలిచింది. మహిళల విభాగంలో భీమవరం ఎస్ ఆర్ కె ఆర్ జట్టు ప్రథమ స్థానాన్ని, ద్వితీయ స్థానాన్ని విఆర్ సిద్ధార్థ కళాశాల జుట్టు, మూడో స్థానాన్ని లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ భీమవరం జట్లు తతీయ స్థానంలో నిలిచాయి.

బస్సు యాత్రను విజయవంతం చేయండి : సింహాద్రి

ప్రజాశక్తి-చల్లపల్లి: రెండో తేదీన అవనిగడ్డలో జరగనున్న వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పిలుపు నిచ్చారు. సామాజిక సాధికారి బస్సు యాత్ర విజయవంతం చేయాలని కోరుతూ చల్లపల్లి మండల వైసిపి అధ్యక్షుడు శీరం వేంకట సత్య నారాయణ (నాని) అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కడవకొల్లు నరసింహారావు, రమేష్‌బాబు మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేసిన విధంగా అవనిగడ్డలో జరిగే యాత్రకు ప్రజలు తరలిరావాలన్నారు.

నందిగామలో కరూర్ వైశ్యా బ్యాంక్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: కరూర్ వైశ్యా బ్యాంక్ నూతన శాఖ నందిగామలో సోమవారం ప్రారంభమైంది. నందిగామ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఎ.రవీంద్రరావు బ్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఇంఛార్జి మాట్లాడుతూ కరూర్ వైశ్యా బ్యాంక్ 827 బ్రాంచీలు, 2230 ఎటిఎంలు ,క్యాష్ రీసైకిలర్స్‌తో టచ్ పాయింట్లని కలిగి ఉందన్నారు. ఈ బ్యాంక్ ప్రగతి, లాభదాయికత, ఆస్తుల నాణ్యత అనే మూడు అంశాలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. బ్యాంక్ 30 సెప్టెంబర్ నాటికి రూ.83,068 కోట్ల డిపాజిట్ బేస్‌తో, రూ.70,448 కోట్ల అడ్వాన్సులతో రూ.1,53,516 కోట్ల వ్యాపారాన్ని నిర్వహిస్తుందన్నారు. బ్యాంక్ ఎప్పటికన్నా అత్యధికంగా మొట్టమొదటిసారిగా గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,106.09 కోట్ల లాభాల్ని సాధించిందన్నారు.



'శ్రీ విశ్వశాంతి' గుర్తింపు రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

నిషేధిత నత్తలను పెంచుతున్న శ్రీ విశ్వశాంతి విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. విద్యాసంస్థల ఆవరణంలో నిషేధిత నత్తలను పెంచడం పలు అనుమానాలకు తావిస్తుందని నాయకులు తెలిపారు. ఇటువంటి నత్తలను పెంచడం వల్ల వరి పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు నిర్ధారించారన్నారు. దీంతో పాటు మాదక ద్రవ్యాల వ్యాపారం జరుగుతుందని అనుమానాలు ఉన్నాయన్నారు. విద్యాశాఖ అధికారులు తూతూ మంత్రంగా కాకుండా పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించాలనానరు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ సమరం, జిల్లా ఉపాధ్యక్షులు కీర్తి, జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్ రాజేష్, జిల్లా కమిటీ సభ్యులు పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



5న యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కౌన్సిల్ సమావేశం



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

వచ్చే నెల 5న ఇబ్రహీంపట్నం లో జరిగే యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ద్వితీయ కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను యుటిఎఫ్ విజయవాడ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 5న ఉదయం తొమ్మిది గంటలకు ఇబ్రహీంపట్నం, వి టి.పి. యస్ 'ఏ' కాలనీలోని యస్‌విసిటి కళ్యాణ మండపంలో జరిగే ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేయస్ యస్.ప్రసాద్, బొడ్డు నాగేశ్వరరావు, ఎస్పీ మనోహర్ కుమార్, సీఐటీయూ నాయకులు డివి కృష్ణ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో విద్యా రంగానికి సంబంధించిన తీర్మానాలు, ఉపాధ్యాయులు వృత్తి సంబంధ విషయాలు తీర్మానాలు, జాతీయ విద్యా విధానం మీద చర్చ, జిపిఎస్ రద్దు మీద భవిష్యత్తు పోరాట కార్యక్రమాలు తదితర విషయాలపై చర్చలు ఉంటాయని వారు చెప్పారు. సాయంత్రం నాలుగు గంటలకు యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి మహేశ్వర వెంకటేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటి సభ్యులు పి.నాగేశ్వరరావు, చలపతిరావు, మూర్తి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.